



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

సమగ్ర వార్తా దినపత్రిక

epaper : https://varthaprabha.com

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 23 | సంచిక : 281 | ది. 17-1-2025 | విజయవాడ | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-



## కృష్ణా జలాల వివాదం.. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ కీలక నిర్ణయం

**హైదరాబాద్,జనవరి 16 (వార్తాప్రభ) :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ వ్యవహారంలో ట్రైబ్యునల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం సమర్పించిన 'అదనపు టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్'పై మొదట విచారణ చేపట్టాలని ట్రైబ్యునల్ నిర్ణయం తీసుకుంది. పునర్విభజన చట్టంలోని మూడో సెక్షన్ ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశంపై మొదట వాదనలు వింటామని స్పష్టం చేసింది. 811 టీఎంసీల్లో రెండు రాష్ట్రాల వాటా తేల్చడం ముఖ్యమని ట్రైబ్యునల్ పేర్కొంది. మూడో సెక్షన్ ప్రకారం రెండు రాష్ట్రాలకు కేటాయింపులపై ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు వింటామని తెలిపింది. ఆ తర్వాతే 89వ సెక్షన్ ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

# అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయి-వృద్ధి రేటు మొదలైంది

- 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికల అమలు
- గతేడాదితో పోలిస్తే ఈసారి 4.03 శాతం అదనపు వృద్ధి సాధించాం
- 15 శాతం వృద్ధితో వచ్చే ఏడాదికి GSDP 18.47 లక్షల కోట్లకు చేరుతుంది
- గత పాలకుల నిర్వాకంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది
- వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ మా నినాదం
- పీ-4ద్వారా పేదల జీవన ప్రమాణాలను పెంచుతాం
- ఈనెల 18న వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుడతా

### ఏపీ వృద్ధి రేటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్




**అమరావతి,జనవరి 16 (వార్తాప్రభ) :** ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నన్ను నమ్మారు. నేను వస్తే అభివృద్ధి జరుగుతుంది. సంపద వస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఓట్లు వేసి గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని, 2047 నాటికి 42 వేల డాలర్ల తలసరి ఆదాయం లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీ వృద్ధి రేటుపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు :** గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సమాధి చేశారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. గత పాలనలో ఎవ్వరికీ స్వేచ్ఛ లేదు. ఇక్కడ పుట్టి పెరిగిన వారు కూడా రాష్ట్రానికి రావాలన్నా , పెట్టుబడులు పెట్టాలన్నా భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. విపత్కర పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లే బాధ్యత ప్రజలు మాకు అప్పగించారని ముఖ్యమంత్రి అన్నారు.

**సంపద సృష్టిస్తేనే ఆదాయం పెరుగుతుంది :** అభివృద్ధి వల్ల సంపద వస్తుంది. సంపద వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ ఆదాయం పెరిగితే దాన్ని సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించి పేదరికం రూపుమాపవచ్చు. ఇది నేను నమ్మిన ఆర్థిక సిద్ధాంతం. 1995లో నేను ఐటీ అంటే అందరూ నవ్వారు. ఐటీ తీసుకొస్తే తిండిపెడుతుందా అని చాలామంది ఎగతాళి చేశారు. నేడు ఐటీ మనిషిని ఎక్కడికో తీసుకెళుతోంది. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణలు, 1992లో వచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని నేను మనసావాచా నమ్మి ఆచరణలో పెట్టాను. నేను తెచ్చిన విజన్ 2020తో నేడు దేశంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణ ముందుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఎక్కువ తలసరి ఆదాయం సంపాదిస్తున్నారు. రెండోతరం ఆర్థిక సంస్కరణలకు నేను నాంది పలికాను. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి రాష్ట్రానికి వెలుగులు ఇచ్చి నేను ఓడిపోయాను. ఆ విషయంలో నేను రాజీపడి ఉంటే ఓడిపోయేవాడిని కాదేమో. విమానాశ్రయాలకు ఓపెన్ స్కై పాలసీ తీసుకొచ్చాను. శంషాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులకు శ్రీకారం చుట్టాను. శంషాబాద్ ఎయిర్ పోర్టును 5 వేల ఎకరాలతో ప్రారంభించామని ముఖ్యమంత్రి చెప్పారు. నాడు విశాలమైన రహదారులకు శ్రీకారం చుట్టాను. నేడు 14 లైన్ల వరకూ రోడ్లు వేస్తున్నారు. నాడు హైదారాబాద్ లో 163 కిలోమీటర్ల రింగ్ రోడ్డుకు శ్రీకారం చుట్టాము. ఇవన్నీ చేయడం వల్ల ఆదాయం పెరిగింది.

**5 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం :** స్వర్ణాంధ్ర %-% 2047 విజన్ లక్ష్యంగా పనిచేస్తున్నాము. 15 శాతం వృద్ధి రేటు సాధించడం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాము. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తయారుకావాలని లక్ష్యాన్ని నిర్దేశించున్నాము. గత సంవత్సరం కంటే ఈ ఏడాది 4.03 శాతం వృద్ధి రేటు పెరిగింది. తెలుగుదేశం హయాంలో తలసరి ఆదాయం వృద్ధి 13.21 శాతం ఉండగా గత ప్రభుత్వంలో అది 9.06 శాతమే ఉంది. దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. ఆదాయం పెరిగితేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అందుకే విజన్ రూపొందించి దానికి అనుగుణంగా పనిచేస్తున్నాము. టీడీపీ వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. టీడీపీ అధికారంలో ఉంటే రైతులకు పండుగే. ఏడు నెలల్లోనే రూ. 1500 కోట్ల బకాయిలు చెల్లించాము.

**పీ-4 గేమ్ ఛేంజర్ :** ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన సంస్కరణలు, తెచ్చిన పాలసీలతో కోట్లాది మంది జీవితాలు మారాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నాడు తీసుకువచ్చిన P3 (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) విధానంతో ఉపాధి, సంపద సృష్టి జరిగింది. ఇప్పుడు స్వర్ణాంధ్ర -2047 విజన్ ను ఆవిష్కరించాం. ఇందులో పేర్కొన్న పది సూత్రాల అమలు ద్వారా తెలుగు జాతిని ప్రపంచంలో నెంబర్ 1 చేసేందుకు అడుగులు వేస్తున్నాం. వీటిలో ప్రథమ సూత్రం జీరో పావర్టీ. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్దేశించిందే P4 కాన్సెప్ట్ (పబ్లిక్ -ప్రైవేటు- పీపుల్-పార్టనర్షిప్) దక్షిణ భారతదేశంలో జనాభా పెరుగుదల రేటు క్షీణించడం ఆందోళన కలిగిస్తోంది. ఏపీ జనాభా వృద్ధి రేటు 1.5 శాతం. దక్షిణ కొరియాలో అయితే 5 శాతం వృద్ధి ఉంది. జపాన్, చైనా, యూరప్ వంటి దేశాల్లో జనాభా తగ్గింది. జర్మనీ వంటి దేశాలు ఇప్పుడు మన మానవ వనరులు కోసం ఎదురుచూస్తున్నాయి.

**వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ మా నినాదం :** ఒక వ్యక్తి ఆనందంగా ఉంటే ఆ కుటుంబం ముందుకుపోతుంది. కొన్ని కుటుంబాల్లో పిల్లలు తల్లిదండ్రులను చూసుకోలేని పరిస్థితి. నేను రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వడంతో ఇప్పుడు తల్లిదండ్రులను పిల్లలు చూసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, కిడ్నీ రోగులకు రూ. 10 వేలు ఇచ్చాం. మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఉన్నవారికి రూ. 15 వేలు ఇస్తున్నాము.

**ఈ నెల 18న వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం :** కుటుంబ వ్యవస్థ వల్ల భద్రత ఉంటుంది. నేడు ఆధార్ వల్ల ఎవరు ఏంటో వెంటనే తెలిసిపోతోంది. పూర్తి వివరాలు వచ్చేస్తున్నాయి. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పెట్టినా, పెన్షన్ ఇచ్చినా, రైతు భరోసా ఇచ్చినా విడివిడిగా ఇస్తున్నారు. నేను వీటన్నింటినీ కుటుంబానికి అనుసంధానం చేస్తున్నాను. ఆ ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తున్నాను. ఏదైనా విపత్తు వస్తే నేరుగా సంబంధిత ఇంటి

- 7లో

# ఇస్రో సరికొత్త చరిత్ర

- ఆ మూడు దేశాల సరసన భారత్
- ఇస్రోకు ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు



**న్యూఢిల్లీ, జనవరి 16 (వార్తాప్రభ) :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇటీవల ఇస్రో పంపించిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్-సీ60 (పీఎస్ఎల్‌వీ)లో జంట ఉప గ్రహాల అనుసంధానం విజయవంతం అయినట్టు ఇస్రో తాజాగా వెల్లడించింది. దీంతో ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ రికార్డుల్లో ఎక్కింది. ఇప్పటి వరకు చైనా, రష్యా, అమెరికా మాత్రమే అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇస్రోకు ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో నుంచి గత ఏడాది డిసెంబరు 30వ తేదీన ఇస్రో. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్-సీ60 (పీఎస్ఎల్‌వీ) లో జంట ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపింది. అయితే, షార్‌లోని ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ బయలుదేరిన 15.09 నిమిషాలకు స్పేడెక్స్-1బి, 15.12 నిమిషాలకు స్పేడెక్స్-1ఎ రాకెట్ నుంచి విడిపోయాయి. ఆ తర్వాత వీటి డాకింగ్ కోసం మూడు సార్లు ప్రయత్నించగా పలు కారణాల వల్ల ఇది వాయిదా పడుతూ వచ్చింది. ఈ ?క్రమంలో తాజాగా ఉపగ్రహాల అనుసంధానం చేపట్టగా విజయవంతం అయినట్టు ఇస్రో ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. ఈ మేరకు స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు ఇస్రో తెలిపింది. ఈ క్రమంలోనే రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్ల నుంచి 3 మీటర్లకు తీసుకొచ్చారు. అక్కడ ఉపగ్రహాలను హోల్డ్ చేసి డాకింగ్‌ను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఇందుకు శ్రమించిన సాంకేతిక బృందానికి, యావత్ భారతీయులకు అభినందనలు తెలిపింది. మరో వైపు ఇస్రో విజయంపైప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. ఈ క్రమంలో ట్విట్టర్ వేదికగా ఇస్రో శాస్త్రవేత్తలకు మోడీ అభినందనలు తెలిపారు. ట్విట్టర్‌లో నరేంద్ర మోడీ 'ఉపగ్రహాల స్పేస్ డాకింగ్‌ను విజయవంతంగా ప్రదర్శించినందుకు ఇస్రోలోని మన శాస్త్రవేత్తలకు, అంతరిక్ష సోదరులకు అభినందనలు. రాబోయే రోజుల్లో భారత్ యొక్క ప్రతిష్టాత్మక అంతరిక్ష కార్యకలాపాలకు ఇది ఎంతో ముఖ్యమైనది. మీ అందరికీ అభినందనలు' అంటూ కామెంట్స్ చేశారు

# పసుపు సైన్యం @ కోటి

### 1,00,52,598 సభ్యత్వాలతో చరిత్ర తిరగరాసిన తెలుగుదేశం పార్టీ

- లక్ష సభ్యత్వాల మార్క్ దాటిన 11 నియోజకవర్గాలు
- 50 వేల సభ్యత్వాల మార్క్ దాటిన 105 నియోజకవర్గాలు
- కార్యకర్తల సంక్షేమం కోసం విప్లవాత్మక అడుగులు వేస్తున్న సంక్షేమ నిధి సారథి నారా లోకేష్
- ప్రమాద భీమాను రూ. 5 లక్షలకు పెంచుతూ యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ తో ఒప్పందం



**అమరావతి,జనవరి 16 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాది అక్టోబర్ 26 న టిడిపి అధినేత చంద్రబాబు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్ లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ్యత్వాలు తీసుకున్న వారి సంఖ్య కోటి మార్క్ ను దాటి చరిత్రను తిరగరాసింది. 1,00,52,598 మంది టిడిపి సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసారు. 11 నియోజకవర్గాలు లక్ష సభ్యత్వాల మార్కును దాటాయి. 105 నియోజకవర్గాలు 50 వేల సభ్యత్వాల మార్కును దాటాయి. కోటి మంది సభ్యులతో తెలుగుదేశం పార్టీ అతి పెద్ద కుటుంబంగా అవతరించింది. టెక్నాలజీ అనుసంధానంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం సులభమైంది. ప్రజలు స్వయంగా సభ్యత్వ నమోదు చేసుకునే సౌలభ్యం కల్పిస్తూ వారు ఎక్కువగా వినియోగించే ప్లాట్ ఫామ్స్ తో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇంత పెద్ద సక్సెస్ కావడానని ప్రధాన కారణం. టెక్నాలజీ వినియోగం ద్వారా పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో ఎవరు కష్టపడి పనిచేస్తున్నారో పార్టీ అధిష్ఠానానికి స్పష్టంగా తెలుస్తుంది. తద్వారా పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇచ్చేప్పుడు ప్రాధాన్యత లభిస్తుంది. పనిచేసే వారికే ప్రాధాన్యత అని లోకేష్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. పార్టీ సభ్యత్వ నమోదులో తాము చేసిన కష్టానికి గుర్తింపు లభిస్తుందని కార్యకర్తలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. నారా లోకేష్ ఎక్కువ సభ్యత్వాలు చేసిన కార్యకర్తలతో మాట్లాడి అభినందించడం, ప్రోత్సహించడం ఈ సక్సెస్ కు ప్రధాన కారణం.


- 7లో

## వార్తాప్రభ నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఝాన్సీ రెడ్డి



**తొర్రూరు,జనవరి 16 (వార్తాప్రభ) :** 2025 నూతన సంవత్సర వార్తాప్రభ తెలుగు దినపత్రిక క్యాలెండర్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ & తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పంతం సురేందర్ ఆధ్వర్యంలో స్థానిక జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ, వార్తా ప్రభ తెలుగు దినపత్రిక దినదిన అభివృద్ధి చెందుతూ నూతన వరవడితో వార్తలు రాస్తూ ప్రజాధరణ పొందాలని, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేయాలని, సమాజంలో నెలకొన్న అసమానతలు, అవినీతి అక్రమాలను, బయట పెడుతూ నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పింగిలి ఉష న్యూస్ ఇండియా పత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ వీరాంజనేయులు, ప్రభ పత్రిక విలేఖరి గాదె కృష్ణ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి విశిష్టత పురస్కారాన్ని దక్కించుకున్న నిషాంత్ కుమార్



**అమరావతి,జనవరి 16 (వార్తాప్రభ) :** ప్రజా పరిపాలనలో మెరుగైన సేవలు అందించినందుకుగాను అబ్కారీ, నిషేధ శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్ కు ప్రతిష్టాత్మక ప్రధానమంత్రి పురస్కారం లభించింది. కేంద్ర ప్రభుత్వ పరిపాలనా సంస్కరణల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ఈ మేరకు నిషాంత్ కుమార్‌కు సమాచారం అందించారు. పార్వతీపురం మన్యం కలెక్టర్ గా "ప్రిజం 10" అమలులో మెరుగైన పనితీరును ప్రదర్శించినందుకు 2023 సంవత్సరానికి గాను ఈ విశిష్ట పుస్కారం లభించింది. ప్రజాసేవలో మమేకమై ఆ జిల్లాకు అందించిన విశిష్ట సేవలకు గాను నిషాంత్ కుమార్ కు కేంద్ర ప్రభుత్వం ఈ గుర్తింపును ఇచ్చింది. దేశ వ్యాప్తంగా ఉన్న సివిల్ సర్వెంట్ల అత్యుత్తమ కృషిని గుర్తించి, పోటీతత్వాన్ని, ఆవిష్కరణలను, ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించేందుకు ఈ అవార్డు నిర్దేశించగా, నిషాంత్ కుమార్ చేపట్టిన "ప్రిజం 10" కార్యక్రమం "ఇన్నోవేషన్-డిస్ట్రిక్ట్" విభాగంలో ప్రధానమంత్రి పురస్కారాన్ని దక్కించుకుంది. ఇది ప్రజా పరిపాలనలో ఉన్నతత సాధన కోసం నిషాంత్ చేసిన కృషిని ప్రతిబింబిస్తుంది.

# ఏలూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు భేష్..

- రూ. 734 కోట్ల విలువైన 3.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ..
- 96 శాతం రైతులకు 24 గంటల్లోనే సొమ్ము చెల్లింపులు..
- జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్..







**ఏలూరు,జనవరి 16 (వార్తాప్రభ) :** ఖరీఫ్ ధాన్యం కొనుగోలు రాష్ట్రంలో మొదటిగా ఏలూరు జిల్లాలో ప్రారంభమై అదే దిశగా కొనుగోళ్లలో జిల్లా అధికారులు చూపిన చొరవను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్ చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు. గురువారం ఏలూ రు విచ్చేసిన రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్ ధాన్యం సేకరణపై మాట్లా డుతూ ఏలూరు జిల్లాలో రూ. 733.91 కోట్ల విలువైన 49,022 మంది రైతుల నుంచి 3,58,924 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయ డం భేషుగ్గా ఉందన్నారు. సంబంధిత రైతులకు సొమ్ముకూడా చెల్లింపు చేయడం అభినందనీయమన్నారు.పౌర సరఫరాల రాష్ట్ర ప్రధాన కార్యా లయం నుండి 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ దానికి మిన్నగా ధాన్యం కొనుగోలు చేయడం పట్ల జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి లను మం త్రి అభినందించారు. ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి నేతృత్వంలో పౌర సరఫరాల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేశార న్నారు. వీరందరిని ఈ సందర్భపంగా ప్రత్యేకంగా మంత్రి నాదెండ్ల మ నోహార్ ప్రత్యేకంగా అభిందించారు. నాలుగు సంవత్సరాల అనంతరం రైతులు నిజమైన సంక్రాంతిని సంతోషంగా జరుపుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చాలా సమర్ధవంతంగా, పటిష్టవం తంగా జరిగిందన్నారు. ఏలూరు జిల్లాలో సుమారు మరో 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు తమ దృష్టికి తీసుకు వచ్చారని తప్పకుండా ప్రతిధాన్యం కూడా ప్రభుత్వం నుంచి కనీస మద్ధతు ధరకు కొనుగోలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కూడా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి లను అభినందించారు.

# ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదాలను నివారిద్దాం..

- సమిష్టి కృషితో ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం... ● రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ పి. రాజశేఖర్ బాబు.




**విజయవాడ,జనవరి 16 (వార్తాప్రభ) :** ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని సమిష్టి కృషితో ప్రజలలో అవగాహన కల్పించి ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేసేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబులు తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేది నుండి నెల రోజుల పాటు జిల్లాలో నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాల ప్రచార సామాగ్రి అయిన పోస్టర్లు, కరపత్రాలు, బుక్ లెట్స్ బ్యానెర్లను గురువారం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు, డీటీసీ ఎ. మోహన్ లు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల పట్ల ప్రజలలో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 16వ తేది నుండి ఫిబ్రవరి 15వ తేది వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా మాసోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రమాదాలు నివారించేందుకు ఎప్పటికప్పుడు రోడ్డు భద్రత సమావేశాలు నిర్వహించి ప్రమాదాలకు గల కారణాలను సమీక్షించి తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా కొంతమేరకు ప్రమాదాలను నివారించగలిగామన్నారు. ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్ (ఐఏఆర్‌డీ) యాప్ ద్వారా రవాణా, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తదితర భాగస్వామ్య పక్షాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సరైన విధంగా నమోదు చేయడం ద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాద బాధితులను కాపాడేందుకు కృషిచేసిన వారికి గుడ్ సమారిటన్ ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రహదారి భద్రతపై ప్రజలను చైతన్యం చేయడంలో యువత, ఎన్‌జీవోలు తదితరులు వినూత్న జాగృతి కార్యక్రమాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజలలో పూర్తి అవగాహన కల్పించేలా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధలను పాటించని వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటున్నామన్నారు, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపే వారిపై కేసులను నమోదు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదలలో కీలకమైన మద్యం సేవించి వాహనాలు నడపడం డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడటం పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ లకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆన్లైన్ ద్వారా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా అనేక చర్యలు చేపట్టినప్పటికి ప్రమాదాల నివారణలో ప్రజలకు అవగాహన కల్పించి వారిని భాగస్వాములను చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. నెల రోజుల పాటు రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని రాజశేఖర్ బాబు పిలిపు నిచ్చారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఎ. మోహన్ మాట్లాడుతూ 16వ తేది నుండి ఫిబ్రవరి 15వ తేది వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని రోడ్డుభద్రతాపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం సహకారంతో పోలీస్, వైద్య ఆరోగ్య , ట్రాన్స్ పోర్ట్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, తదితరశాఖల సమన్వయంతో స్వచ్ఛంధ సంస్థలు ప్రజలను భాగస్వాములను చేసి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రచారసామగ్రి విడుదల కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు ఆర్. ప్రవీణ్, కె. వెంకటేశ్వరరావు, కె. శివరాం గౌడ్, ఉదయ్ శివప్రసాద్, డీవీ. రమణ, ఎన్ఎవస్ వర్మ, కేడీవి రవికుమార్, బి. శ్రావణి, సత్యన్నారాయణ, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం. రాజుబాబు, డిప్యూటీ డియంహెచ్ ఓ జె. ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

## మణితేజది ముమ్మాటికి రాజకీయ హత్య

- ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం జరిపించండి
- వైసీపీ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్




**నందిగామ,జనవరి 16 (వార్తాప్రభ) :** మణి తేజ ది ముమ్మాటికి రాజకీయ హత్యే అని ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ ఆరోపించారు. గురువారం చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామానికి చెందిన నల్లాని మణి తేజ మృతదేహాన్ని స్థానిక వైసీపీ నాయకులతో కలిసి అవినాష్ మార్చురీలో పరిశీలించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ మణి తేజ మృతి పై తమకు అనేక అనుమానాలు ఉన్నాయి అన్నారు. మణి తేజ మృతిని టిడిపి నాయకులు వారికి మద్దతుగా పోలీసులు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారనీ విమర్శించారు. మణి తేజ మృతదేహానికి ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం చేయించి మాకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ డిమాండ్ చేశారు. కోడిపందాల బరిలో జరిగిన గొడవలను అడ్డుపెట్టుకుని మణితేజను పట్టణ పెట్టుకుని ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో టిడిపి చిచ్చు పెడుతుందని అవినాష్ మండిపడ్డారు. ఈ ఘటనకు కారణమైన వారిని గుర్తించి వారిపై మర్డర్ కేసు నమోదు చేయాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, జగ్గయ్యపేట నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి మీరు నాగేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శి గుంటూరు జిల్లా తదితర వైసీపీ నాయకులు డిమాండ్ చేస్తూ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కు ఫిర్యాదు చేశారు.

## రోడ్డు భద్రత నియమాలను పాటించండి

- రోడ్డు భద్రత మాసోత్సవాల కరపత్రాల పంపిణీ
- ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎం పద్మావతి



**నందిగామ,జనవరి 16 (వార్తాప్రభ) :** రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ ప్రమాద రహిత ప్రయాణం చేయాలని ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎం పద్మావతి కోరారు. గురువారం స్థానిక ప్రాంతీయ రవాణా కార్యాలయం వద్ద జాతీయ రోడ్డు భద్రతా మసోత్సవాలను వివిధ శాఖల అధికారులతో కలిసి పద్మావతి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ నేటి నుండి వచ్చే నెల 15వ తేదీ వరకు నెల రోజులపాటు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రతిరోజు రోడ్డు భద్రత మహోత్సవములో భాగంగా పోలీస్,వైద్య,ఆర్ అండ్ బి, వాహన డీలర్లు, విద్యాశాఖ నేషనల్ హైవే అథారిటీ తదితర శాఖల సమన్వయంతో సమావేశాలు ర్యాలీలు,సమీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం వి నారాయణ రాజు, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కే జయచంద్ర, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నరేష్, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ బాబురావు,నేషనల్ హైవే మేనేజర్ శ్రీనివాసరావు, పరిపాలన అధికారి బి.ఎస్.కె ప్రభాకర లింగం, సీనియర్ అసిస్టెంట్ పి లక్ష్మి,అన్నపూర్ణ డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు, పర్వతనేని సుభాష్ చంద్రబోస్ డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు సాయిబాబు ఎంపిక



**గన్నవరం,జనవరి 16 (వార్తాప్రభ) :** ఒడిస్సా రాష్ట్రంలోని పూరి నగరంలో జరుగుతున్న సీనియర్ పురుషుల జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు గోగులమూడి సాయిబాబు ఎంపిక. గన్నవరంలో ఓ పత్రికా విలేకరిగా విధులు నిర్వహిస్తున్న గోగులమూడి సాయిబాబు స్వతహాగా చిన్నతనం నుండి క్రీడలపై మక్కువతో ఖోఖో క్రీడలో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలలో కూడా పాల్గొన్నారు. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన ఏడవ రాష్ట్రస్థాయి పురుషుల షూటింగ్ బాల్ పోటీలలో కృష్ణాజిల్లా జట్టు కి ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్ తెలిపారు. ఈ పోటీలు ఒరిస్సా రాష్ట్రంలో జనవరి 17, 18, 19 మూడు రోజులు పాటు ఎంతో ఘనంగా జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబాను కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సభ్యులు, జిల్లాలోని ప్రముఖ క్రీడాకారులు క్రీడా సంఘ నాయకులు ఎంతగానో అభినందించారు.

## పల్లెల్లో వైభవంగా సంక్రాంతి.. కనుమ పండుగ



**మచిలీపట్నం,జనవరి 16 (వార్తాప్రభ) :** సంక్రాంతి పండుగ మూడవ రోజుగా జరుపుకొనే అత్యంత సంతోషమైన కనుమ పండుగ. తెలుగు రాష్ట్రాలకు ఈ పండుగ ఎంతో ప్రత్యేకమైనది. ప్రకృతిని ఆరాధించడం, పశువులను, పంటలను పూజించడం, మానవ సంబంధాలను దృఢపర్చుకోవడానికి ఈ కనుమ పండుగను అన్ని కుటుంబాలకు చెందిన వారు జరుపుకుంటారు. ముఖ్యంగా పల్లెల్లో నివసించే ప్రజలకు పశువుల పెంపకం, పంటలు పండిరచడమే అతి ముఖ్యం. పశువులను అందంగా అలంకరించడం, పూజించడం సాంప్రదాయంగా వస్తోందని చంద్రగిరికి చెందిన అశ్విని తెలిపారు. ఆమె కనుమ పండుగ గురించి ఇలా వివరించారు. కనుమ రోజున రైతులు ఉదయాన్నే ఊళ్లోనే ఉన్న చెరువు దగ్గరకు లేదా ఇళ్ళ దగ్గర పశువులను శుభ్రంగా కడిగి, పశువుల కొమ్ములకు రంగులు వేసి, పసుపు, కుంకుమలతో, పుష్పాలతో అలంకరిస్తారు. వాటి కాళ్ళకు చిరుమువ్వలు కట్టి వాటి సవ్వడికి పరవశించిపోతారు. మెడలో చిరు గంటలు కడతారు. ఆ చిరుగంటల లయ సవ్వడికి ఇంటిల్లిపాదీ సంతోషపడతారు. తమ ఇంటిలో లక్ష్మీదేవి నడయాడుతున్నట్లుగా పరవశించి పోతారు. భక్తిశ్రద్ధలతో పశువులచుట్టూ ప్రదక్షిణాలు చేస్తారు. వాటి కిష్టమైన ఆహారాన్ని పెడతారు. ఎండలో, వానలో సంవత్సరమంతా కష్టపడుతున్న పశువులవల్లనే తమ కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని పిండి వంటలతో అయిన వారినందరినీ పిలిచి సంతోషంగా కనుమ పండుగను చేసుకుంటారు. పూర్వం ఎడ్లబండ్లలో తిరిగే రోజుల్లో చుట్టుప్రక్కల గ్రామాలకు బండ్లలోనే వెళ్ళి బంధువులను, స్నేహితులను పలకరించి వస్తూ ఉండేవారు. ఇప్పుడు కాలం మారింది. ఎడ్లబండ్ల ప్రయాణాలు లేవు. అయినా పట్నాలలో ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడిన వారు ఉన్న ఊరికి పండుగ రోజుల్లో వచ్చినప్పుడు ఎడ్లబండ్లమీదనే సరదాగా తిరుగుతూ తమ చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఉంటారు.


## ఆర్టీసీ భద్రతా మాసోత్సవాలు ప్రారంభం



**కాకినాడ,జనవరి 16 (వార్తాప్రభ) :** రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)లో జరుగుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం కాకినాడ డిపోలో జరిగింది. కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.హరినాథ్ రెడ్డి హాజరయ్యారు.డిపో మేనేజర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు,డ్రైవర్లు బస్సులు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదములను అరికట్టకు కావలసిన నైపుణ్యములను వివరించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ డిపో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ,పీఆర్వో సిహెచ్. వెంకటరాజు అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు. నెల రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జరుగు కార్యక్రమం షెడ్యూల్ ను కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. శ్రీనివాసరావు విడుదల చేశారు. జనవరి- 16 ప్రారంభ వేడుక జనవరి 17-21 బస్సులు కండిషన్ మెరుగుపరుచుట జనవరి 22 -23 ప్రమాద రహిత డ్రైవర్లకు సేఫ్టీ అలవెన్స్ ఇచ్చుట జనవరి- 24 డ్రైవర్స్ డేగా జరుపుకొనుట జనవరి 25-28 రోడ్డు భద్రతపై డ్రైవర్లకు శిక్షణ ఇచ్చుట జనవరి -29 నుండి ఫిబ్రవరి -4 వరకు డ్రైవర్లకు వైద్య పరీక్షలు ఫిబ్రవరి 5-6 ప్రమాదములు చేసిన డ్రైవర్లకు కుటుంబంతోపాటు కౌన్సిలింగ్ ఫిబ్రవరి 7 - 10 రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కలిగించుట ఫిబ్రవరి 11 -12 బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఫిబ్రవరి 13 -14 రోడ్ సేఫ్టీపై ఆడిట్ ఫిబ్రవరి -15 ముగింపు వేడుక, ఉత్తమ డ్రైవర్లకు బహుమతి ప్రధాన ఉత్సవాలు నిర్వహించనున్నారు.

## పునర్నియామకం ఆలస్యం...

- పుట్టెడు దుఃఖంతో ఓ తండ్రి కన్నుమూత! ● ఆరోగ్యసహాయకుల ఆర్తనాధాలకు అంతులేదా? ● బాధితుడ్ని పరామర్శించిన కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నేత జీ.వీ.వీ.ప్రసాద్



**విజయవాడ,జనవరి 16 (వార్తాప్రభ) :** తన కన్నకొడుకు కోల్పోయిన ఉద్యోగం పునర్నియామకంలో జరుగుతున్నా జాప్యం ఓ కన్నతండ్రి కన్నుమూసేలా చేసింది. ఇందుకు సంబందించిన వివరాలను ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ.వీ.వీ.ప్రసాద్ గురువారం సాయంత్రం పత్రికల వారికి తెలియజేసారు. విజయవాడకు చెందిన బిల్లా రవికుమార్ జింఖానా గ్రౌండ్స్ మలేరియా విభాగంలో కాంట్రాక్టు ఆరోగ్యసహాయకునిగా పనిచేస్తున్నారు. తెలంగాణా హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రవికుమార్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా 920 మంది ఆరోగ్యసహాయకులను ప్రభుత్వం డిసెంబర్ 5 న ఉద్యోగం నుంచి తొలగించారు. అయితే, అదే హైకోర్టు మెరిట్ లో వున్నా వారిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కూడా ఆదేశించింది. ఉద్యోగాల నుంచి తొలగించడంలో అధికారులు చూపిన ఉత్సాహం తిరిగి పునర్నియామకం చేయడంలో అలక్ష్యం చేస్తూ, నేటికి 40 రోజులు గడిచిపోయినా వారు తిరిగి ఉద్యోగాల్లోకి రాలేక పోయారు. ఉద్యోగాలు కోల్పోయిన వారంతా ఏళ్ల తరబడి ఉద్యోగాలు చేస్తూ యాభై ఏళ్ల వయస్సు పైబడినవారే. 50 ఏళ్ల వయసులో అకస్మాత్తుగా ఉద్యోగాలు కోల్పోవడంతో తీవ్ర ఆందోళన, ఆవేదనకు గురై రాష్ట్రంలో ఇప్పటికే నలుగురు బలైపోయారు. ఈ విషాదాలకు అంతులేదన్నట్టు విజయవాడ సింగ్ నగర్ కు చెందిన బిల్లా దేవదాసు అసలే అంతంతమాత్రం ఆరోగ్యంతో బాధపడుతూ, తన కొడుకు ఉద్యోగం కోల్పోయాడనే మానసిక వేదనతో మరింత కుంగిపోయి బుధవారం రాత్రి మరణించారు. ఉన్నా ఉద్యోగం, కన్నతండ్రి ని కోల్పోయిన రవికుమార్ ని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వీ.వీ.ప్రసాద్ గురువారం పరామర్శించి తమ బాధను పంచుకున్నారు. జరుగుతున్నా దురదృష్టకర విషాద పరిస్థితులనైనా ప్రభుత్వం దృష్టిలో వుంచుకుని తక్షణమే ఆరోగ్యసహాయకుల పునర్నియామకంపై దృష్టి సారించాలని, ఈ విషయాలన్నింటినీ తాను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ప్రసాద్ తెలియజేశారు.

## బంగారు బాబుకు థార్ కారు



**కాకినాడ రూరల్ /కరప,జనవరి 16 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండల పరిధిలోని కొరిపల్లిలో నిర్వహించిన కోడి పందేల్లో కాజులూరు మండలం బందనపూడి గ్రామానికి చెందిన దేగల నాగేంద్ర (గోల్డ్ మ్యాన్) వర్గం విజేతగా నిలిచి మహీంద్ర థార్ కారును కైవసం చేసుకున్నారు. సంక్రాంతి పురస్కరించుకుని పెనుగుదురు - కరప మధ్యలో కొరిపల్లి సరిహద్దులో మూడు రోజుల పాటు 63 కోడి పందేలు నిర్వహించగా.. నాగేంద్ర వర్గీయులు 38, కొండబాబు వర్గీయులు 25 పందేలు గెలిచారు. గత ఏడాది గురజనాపల్లిలో నిర్వహించిన కోడి పందేల్లో నాగేంద్ర బుల్లెట్ ను కైవసం చేసుకున్నారు.

## టెన్నికాయిట్ జాతీయ క్రీడాకారిణిని సన్మానించిన యం. యల్. ఏ.



**గూడూరు, జనవరి 16 (వార్తాప్రభ) :** తిరుపతి జిల్లా, గూడూరు లో గురువారం తేదీన జనవరి 11,12-2025 తేదీల లో పలాస లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీల లో ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి నెల్లూరు జిల్లా క్రీడాకారిణి నారిపాక మానస ను గూడూరు నియోజవర్గం ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఈ రోజు తన నివాసం వద్ద సన్మానించారు. వారు మాట్లాడుతూ తన నియోజకవర్గం పరిధిలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రాష్ట్ర స్థాయి పోటిలలో ద్వితీయ స్థానం సాధించి జనవరి 31 వ తేదీ నుండి చెన్నై నగరంలో జరుగు టెన్నికాయిట్ జాతీయ పోటీలలో పాల్గొనబోవడం చాలా అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ సెక్రెటరీ రమ్య మరియు అస్సోషియేషన్ కార్యవర్గ సభ్యులు వారి కృషి హర్షణీయమని, భవిష్యత్తు లో మరికొంత మంది క్రీడాకారులను తయారు చేసి మన గూడూరుకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు... ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ , ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి. భాస్కర్, కరిముల్లాఖాన్, రమేష్, పుల్లమరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల క్యాలెండర్ ఆవిష్కరణ..



**చల్లపల్లి: అవనిగడ్డ,జనవరి 16 (వార్తాప్రభ) :** గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం క్యాలెండర్ను గురువారం చల్లపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఘంటసాల కృష్ణమోహన్, ఎ ఎస్ ఓ. షేక్ అఖిల పర్వీన్, జూనియర్ అసిస్టెంట్ పుట్టి యోచిత, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు బి. వెంకటరత్నం, ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ,గన్నవరం మండలం అధ్యక్షులు ఎం. పూర్ణచంద్రరావు, చల్లపల్లి మండల అధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కోసం తాము కృషి చేస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షులు బి. వెంకట రత్నం తెలియజేశారు.

## రహదారి మాసోత్సవాల కరపత్రం ఆవిష్కరణ




**కాకినాడ ,జనవరి 16 (వార్తాప్రభ) :** రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు, ప్రచార సామగ్రిని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతి లాల్ దండే ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ ఉప రవాణా కమిషనర్ కె.శ్రీధర్,ఉప రవాణా అధికారి జివి.శివరెడ్డి, మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్లు బి.మురళీ కృష్ణ,ఎం.హరినాథ్ రెడ్డి,బి. లక్ష్మి కిరణ్ లక్ష్మి కిరణ్, ఎన్ సబిత డి శ్రీకాంత్ బాబు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు జి గౌరీ శంకర్, కెవి.నాగేంద్ర, కళా జ్యోతి,శ్వేత సాయి, సాయిబాబు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# శిల్పా రామం లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





**శేరిలింగంపల్లి,జనవరి 16 (వార్తాప్రభ):** మాదాపూర్ లోని శిల్పారామం లో గాంధీ శిల్ప బజార్ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గురువారం నాట్య గురువులు చంద్ర శేఖర్ శిష్య బృందం మరియు కుమారి ప్రణవి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. తాండవ నృత్య కారి,బ్రహ్మాం జలి, సరస్వతి కీర్తన, విన్నపాలు,అన్నమాచార్య కీర్తనలు, భామాకలాపం,కొలువైతి వరంగా సాయి అంశాలను అమూల్య,స్నిగ్ధ,సురభి, మహాలక్ష్మి, వాసుకి,అక్షర,రిత్విక్,వాసుకి, వసుధ,మొదలైనవారు ప్రదర్శించి మెప్పించారు.కుమారి ప్రణవి తుమ్మాటి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహన,విఘ్నారాజం భజే,మీనాక్షి పంచరత్న,గరుడ గమన,ముద్దుగారే యశోద,ఇదిగో భద్రాద్రి,కుండా పై నృత్యం అంశాలను శ్రీ విద్య,సహస్ర,అర్షి, సమన్విత,నక్షత్ర,శాన్వి రితిక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# కాంగ్రెస్ పార్టీకి జైపాల్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం

**పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జైపాల్ రెడ్డి 83వ జయంతి వేడుకలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి**



**పాలకుర్తి జనవరి 16 (వార్తా ప్రభ)** మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ కేంద్ర మంత్రి అత్యుత్తమ పార్లమెంటరీ అవార్డు గ్రహీత జైపాల్ రెడ్డి 83వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు పాల్గొనిజైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జైపాల్ రెడ్డి ప్రజాసేవా తత్పరత, పార్లమెంటరీ నైపుణ్యాన్ని హేనలేనిది అన్నారు. ఆయన ఆశయాలు నేటి యువతకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోజైపాల్ రెడ్డి జీవితం నుండి నేర్చుకోవాల్సిన విలువలు, ప్రజల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న కీలక నిర్ణయాలను మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, యువజన సంఘాలు, మహిళా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కూకట్ పల్లి,జనవరి 16(వార్తాప్రభ):** మకర సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం మైప గ్రామంలో స్థానిక క్షత్రియ సంఘం ప్రతినిధులతో కలిసి స్వర్గీయ అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కూకట్పల్లికి చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 7న లక్షల డప్పులు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**మాదిగ కళాకారుల రాష్ట్ర కోఆర్డినేటర్ యసారపు రాంబాబు మాదిగ పిలుపు**



**తొర్రూర్ జనవరి 16 (వార్తా ప్రభ)** ఫిబ్రవరి 7న లక్షల డబ్బులు వేల గొంతులు కార్యక్రమం, హైదరాబాదులో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, మాదిగ కళాకారుల రాష్ట్ర కోఆర్డినేటర్ యాసారపు రాంబాబు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం తొర్రూర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై, రాంబాబు మాట్లాడుతూ, జనవరి 17న తొర్రూర్ డివిజన్ కేంద్రంలో మాదిగల, మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో 300 మంది డప్పు కళాకారుల చేత, అంబేద్కర్ విగ్రహం నుండి పాల కేంద్రం వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు జరిగే భారీ ర్యాలీ కి మాదిగలు మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరు కావడం జరుగుతుందని, కావున వివిధ గ్రామాల నుండి మాదిగలు మాదిగ ఉపకులాల ప్రజలు వేలాదిగా తరలి ఈభారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య మాదిగ ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమారపు ఐలయ్య మాదిగ ఎం ఇ ఎఫ్ నాయకులు మాంకాల బుచ్చయ్య మాదిగ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ బరిగెల బాబు మాదిగ మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య ఈనపల్లి శ్రీనివాస్ మాదిగ తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పంతం సురేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు వేల్పుల రమేష్ మాదిగ మంద యాకమల్లు మాదిగ వెల్తూరి పూర్ణచందర్ మాదిగ రాయిశెట్టి ఉపేందర్ మాదిగ వెంకన్న మాదిగ మంగళపల్లి నాగరాజు మాదిగ రంజిత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ చరిత్ర తెలిపే జ్ఞాన మార్గదర్శి

**● కమ్మవారి సేవా సంఘాల ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్ విష్కరణ**



**శేరిలింగంపల్లి,జనవరి 16 (వార్తాప్రభ):** తెలంగాణ రాష్ట్ర కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర 2025 ఆంగ్ల సంవత్సర కేలండర్ ను హైదరాబాద్ అమీర్ పేట కమ్మ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంగటేశ్వర రావు(సివియర్), రాష్ట్ర అధ్యక్షులు పిఎసి చైర్మన్ శేరిలింగంపల్లి హ్యాట్రిక్ ఎంఎల్ఏ ఆరెకపూడి గాంధీ,ఎమ్మెల్సీ తాత మధు,మిర్యాలగూడ మాజి ఎంఎల్ఏ భాస్కర్ రావు లు ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్ర సంఘంలో ఈ మధ్య కాలంలో ఎదురైనా సంఘటనలు,వాటి పరిష్కారాలపై వివరణ ఇవ్వడం జరిగింది.కేలండర్ ను తీసుకురావడంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్లూరి పాండురంగారావు కృషి ఎనలేనిది అని,ఇరవై రోజులు నిర్విరామంగా శ్రమించి ఈ కేలండర్ నీ తీసుకు రావడం జరిగిందనీ అన్నారు.కేలండర్ రూపకర్త,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్లూరి పాండురంగారావు మాట్లాడుతూ... కేలండర్ అంటే ఏదో వారాలు,తేదీలు,తిథులు చూడటం కాదని,కేలండర్ ఒక చరిత్ర ను తెలిపే జ్ఞాన మార్గ దర్శిగా,పిల్లలకు మన కుల,దేశ చరిత్ర తెలిపేదిగా ఉండాలనే ఉద్దేశ్యంతో తాయారు చేయటం జరిగింది అని,మన కులాన్ని మన వాళ్ళను గుర్తిస్తూ,ఇతర ప్రముఖులను గౌరవించుకునే విధంగా రూపు దిద్దటం జరిగిందనీ వివరించారు.. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైనా ఎమ్మెల్సీ తాత మధు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన రాష్ట్ర కమిటీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, కమ్మ వారికి,సంఘానికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళల ఉంటాయి అని,భావన నిర్మాణానికి రాష్ట్ర కమిటీ ఎలాంటి భాధ్యత ఇచ్చినా నెరవేరుస్తాను అన్నారు.మాజి ఎంఎల్ఏ భాస్కర్ రావు మాట్లాడుతూ త్వరగా గత రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భూమి సమస్యను త్వరగా పరిష్కరించుకొని ఆ స్థలంలో వెంటనే అనుకున్న విధంగా కాన్స్ట్రక్షన్ మొదలు పెట్టాలని సంఘం నాయకులను కోరారు.. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు పిఎసి చైర్మన్ శేరిలింగంపల్లి హ్యాట్రిక్ ఎంఎల్ఏ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ రాష్ట్ర సంఘం తెలంగాణాలోని అన్నీ సంఘాలను సమన్వయ పరుస్తూ, ఎప్పటికప్పుడు ఏ సమస్య ఉన్నా పరిస్కరించుకుంటూ ముందుకు పోతున్నామని, త్వరలో రాష్ట్ర రాజదాని లో ఇచ్చిన భూమి సమస్య కోడా పరిష్కరించుకుని ఆ స్థలంలో పనులు మొదలు పెట్టటం కోసం ఆర్థిక వనరులు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ 2025 ఆంగ్ల సంవత్సర కేలండర్ లను రాష్ట్ర కమిటీ సభ్యులు స్వయంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి అందజేస్తూ,,వారి అభిప్రాయాలను సలహాలను తీసుకొని వస్తారని ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి నిర్మొహమాటంగా తీసుకురావాలని కోరారు.. కొంత మంది పని పాటా లేని సనాసుల మాటలు పట్టించుకోవద్దని, వాస్తవాలు జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని కుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ను మరవవద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్,రాష్ట్ర కమిటీ సభ్యులు అడుసుమిల్లి వెంకటేశ్వరరావు,డాక్టర్ నాగభూషణం,పాతూరి వెంకటరావు,తాళ్లూరి చంద్రమౌళి,పొట్లూరి పాండురంగారావు,పినపాక ప్రభాకర్,శివన్నారాయణ, శ్రీనివాస ప్రసాద్,శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 7న లక్షల డప్పులు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**● మాదిగ కళాకారుల రాష్ట్ర కోఆర్డినేటర్ యసారపు రాంబాబు మాదిగ పిలుపు**



**తొర్రూర్ జనవరి 16 (వార్తా ప్రభ)** ఫిబ్రవరి 7న లక్షల డబ్బులు వేల గొంతులు కార్యక్రమం, హైదరాబాదులో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, మాదిగ కళాకారుల రాష్ట్ర కోఆర్డినేటర్ యాసారపు రాంబాబు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం తొర్రూర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై, రాంబాబు మాట్లాడుతూ, జనవరి 17న తొర్రూర్ డివిజన్ కేంద్రంలో మాదిగల, మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో 300 మంది డప్పు కళాకారుల చేత, అంబేద్కర్ విగ్రహం నుండి పాల కేంద్రం వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు జరిగే భారీ ర్యాలీ కి మాదిగలు మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరు కావడం జరుగుతుందని, కావున వివిధ గ్రామాల నుండి మాదిగలు మాదిగ ఉపకులాల ప్రజలు వేలాదిగా తరలి ఈభారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య మాదిగ ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమారపు ఐలయ్య మాదిగ మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ ఎం ఇ ఎఫ్ నాయకులు మాంకాల బుచ్చయ్య మాదిగ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ బరిగెల బాబు మాదిగ మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య ఈనపల్లి శ్రీనివాస్ మాదిగ తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పంతం సురేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు వేల్పుల రమేష్ మాదిగ మంద యాకమల్లు మాదిగ వెల్తూరి పూర్ణచందర్ మాదిగ రాయిశెట్టి ఉపేందర్ మాదిగ వెంకన్న మాదిగ మంగళపల్లి నాగరాజు మాదిగ రంజిత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.


# బిబిపేట్ మండలంలో కోతుల బెడద

**కామారెడ్డి,జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కామారెడ్డి జిల్లా బిబిపేట్ మండలంలో కోతులను ఊరు బయటకు తరిమికొట్టిన మళ్లీ మళ్లీ ఇళ్లల్లో రావడం జరుగుతుందని మాజీ ఎంపీటీసీ కొరివి నీరజ నర్సింలు అన్నారు. కోతులతో చాలా ప్రమాదం ఉందని ఇళ్ల లోపలకొచ్చి పిల్లలను పెద్దలను కరవడం జరుగుతుంది, కాబట్టి కోతులకు నుండి అటవీశాఖ అధికారులు కానీ జిల్లా అధికారులు కానీ పట్టించుకోకపోవడం వల్లనే ప్రజలంతా ఇబ్బందుల పాలవుతున్నారని భయభ్రాంతులవుతున్నారని ఈ వార్త చూసిన తర్వాత అయినా అధికారులు అప్రమత్తమై బిబిపేట ప్రజలను కోతుల నుంచి రక్షించాల్సిందిగా కోరుతున్నారు.

# పాలమూరు జిల్లాకు జయపాల్ రెడ్డి పేరు పెట్టాలి

**● తెలంగాణ సాకారంలో ముఖ్య భూమిక పోషించిన జయపాల్ రెడ్డి ● ఘనంగా జయపాల్ రెడ్డి జయంతి వేడుకలు ● శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ● జయంతి వేడుకల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు**

**హైదరాబాద్ :జనవరి:16 (నేటి మనదేశమ్):** రాష్ట్ర, దేశ రాజకీయాల్లో మచ్చలేని వ్యక్తిగా ముందు వరుసలో కేంద్ర మాజీ మంత్రి ఎస్. జయపాల్ రెడ్డి నిలుస్తారని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లో పివి మార్గ్ స్ఫూర్తి స్థల్ లో అధికారికంగా నిర్వహించిన మాజీ కేంద్ర మంత్రి ఎస్. జయపాల్ రెడ్డి 83 వ జయంతి వేడుకల్లో అయన పాల్గొని జయపాల్ రెడ్డి సమాధి పై పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన సభ్యులుగా లోక్ సభ, రాజ్య సభ సభ్యులుగా అలాగే కేంద్ర మంత్రిగా చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని అన్నారు. తెలంగాణ సాధనలో భాగంగా పార్లమెంట్ లో ముఖ్య భూమిక పోషించారని తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు కేంద్రానికి వివరించడంలో సఫలీకృతుడయ్యారని అలాగే అత్యుత్తమ పార్లమెంటరీయన్ గా జయపాల్ రెడ్డి చూపిన బాటలో నాయకులు నడవాలని అన్నారు. అదేవిదంగా ఆ మహానేత పాలమూరు జిల్లా వాసి కావడంతో పాలమూరు జిల్లాకు జయపాల్ రెడ్డి పేరు పెట్టాలని కోరారు.భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు జయపాల్ రెడ్డి గారికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ సమాకాలిన భారత రాజకీయాల్లో మొదటగా నిలిచేగొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటరీయన్ మంచి విలవలు,నిజాయితీ గల గొప్ప రాజకీయ నాయకుడు మాజీ కేంద్ర మంత్రి ఎస్. జయపాల్ రెడ్డి అన్నారు.శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సహకారంలో జయపాల్ రెడ్డి ముఖ్య పాత్రను ప్రజలు ఎన్నడికి మరిచిపోరని చేపట్టిన పదవులకు వన్నె తెచ్చారాని గొప్ప పార్లమెంటరీయన్ అని అన్నారు. స్ఫూర్తి స్థల్ లో ఎస్. జయపాల్ రెడ్డి 83 వ జయంతి వేడుకల సందర్భంగా సమాధిపై పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. స్ఫూర్తి స్థల్ లో జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర ముఖ్యమంత్రి సతీమణి గీతా రెడ్డి, కుటుంబ సభ్యులు, ప్రభుత్వ సలహా దారులు కేశవ రావు, వేం నరేందర్ రెడ్డి,రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎంఎల్ సి లు జీవన్ రెడ్డి, కోదండ రాం, ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటెల రాజేందర్, శాసన సభ్యులు గడ్డం వివేక్, సుదర్శన్ రెడ్డి, నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి, యశస్విని, జైవీర్ రెడ్డి, కూనంనేని సాంబశివరావు,మందుల సామెలు,మాజీ మంత్రి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, కెవిపి రామచంద్ర రావు, డిజిపి డాక్టర్ జితేందర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మెట్రో ఎండి ఎన్ వి ఎస్ రెడ్డి, నాయకులు జయపాల్ రెడ్డి తదితరులు జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారులు జైపాల్ రెడ్డి సమాధిపై పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.



వార్తా ప్రభ

# హైదరాబాద్

## దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. రమేష్



**సికింద్రాబాద్,జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ట్రాక్ కిలోమీటర్లు, రైళ్ల కార్యకలాపాల నిర్వహణ మరియు ఆదాయా పరంగా భారతదేశంలోని అతిపెద్ద రైల్వే జోన్లలో ఒకటైన దక్షిణ మధ్య రైల్వేకు ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పి.సి.సి.ఎం)గా ఎన్. రమేష్ సికింద్రాబాద్లోని రైలు నిలయంలో జనవరి 15, 2025న పదవి బాధ్యతలు స్వీకరించారు. వీరు ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1992 బ్యాచ్కి చెందినవారు. వీరు బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ మరియు లా (బి.ఎస్సీ,బి.ఏ.,ఎల్.ఎల్.బి) లలో పట్టభద్రులు. ప్రస్తుత నియామకానికి ముందు వారు నైరుతి రైల్వేలో చీఫ్ క్లెయిమ్స్ ఆఫీసర్గా విధులను నిర్వర్తించారు.30 సంవత్సరాల తన రైల్వే కెరీర్ లో, భారతీయ రైల్వేలలో బెంగళూరు డివిజన్లో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ మరియు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, న్యూఢిల్లీలోని గౌరవ రైల్వే మంత్రికి డైరెక్టర్/పబ్లిక్ గ్రీవెన్స్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/కో-ఆర్డినేషన్బీ నైరుతి రైల్వేలో చీఫ్ ట్రాన్స్పోర్టేషన్ మేనేజర్, చీఫ్ కమర్షియల్ మేనేజర్ మరియు చీఫ్ క్లెయిమ్స్ ఆఫీసర్ వంటి అనేక కీలక పదవులను నిర్వహించారు.ఆయన భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీగా ఎంపానెల్ చేయబడ్డారు. 2014-2019 సంవత్సరంలో గౌరవ రైల్వే మంత్రి వద్ద ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/సమన్వయ అధికారిగా పనిచేస్తున్నప్పుడు వ్యయ భాగస్వామ్య ప్రాతిపదికన రైల్వే ప్రాజెక్టులను చేపట్టడానికి భారత రైల్వేలతో ఒక ఎం.ఓ.యు (అవగాహన ఒప్పందం)పై సంతకం చేయడానికి ఆయన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

## పిఎసి చైర్మన్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ని కలిసిన అంబాల మహేష్ గౌడ్



**కూకట్ పల్లి,జనవరి16(వార్తాప్రభ):** తెలంగాణ రాష్ట్ర పిఎసి చైర్మన్ మరియు శేరీలింగంపల్లి శాసన సభ్యులు ప్రైవేట్ ఉద్యోగుల సంఘం సలహాదారులు అరికెపూడి గాంధీ ని గురువారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబాల మహేష్ గౌడ్ మరియు ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు గంధం రాములు ,రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యారా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యం మా మధు..



**షాద్ నగర్, జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హర్షం వ్యక్తం చేసి అభినందించిన మాజీ జెడ్పిటిసి పల్లె నర్సింగరావు మరియు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కానం ప్రేమ్ కుమార్ గౌడ్ రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లె అంజయ్య సువర్ణ దంపతుల కుమారుడు పల్లె మధుసూదన్ తెలంగాణ జెన్కో (ఏఈ) అసిస్టెంట్ ఇంజనీర్ గా ఉద్యోగం సాధించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టీజీ జెన్కో లో అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగం సాధించినందుకు గాను కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి పల్లె నర్సింగరావు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు కానం ప్రేమ్ కుమార్ గౌడ్, కే దశరథ్ ,తదితరులు పాల్గొని మధుసూదన్ ని సన్మానించారు.

## తెలంగాణ రైతు రక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరించిన.... టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి...

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 16, (వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ రైతు రక్షణ సమితి సంగారెడ్డి జిల్లా క్యాలెండర్ ను టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ఆవిష్కరించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక ఐబీ అతిథి గృహంలో ఈ కార్యక్రమం జరిగింది.

# ఎడిటోరియల్

## లోకేష్ కూడా రెడీ !

ఏపీలో అధికారంలోకి టీడీపీ కూటమి వచ్చి ఏడు నెలలే అయింది. ఇంకా ఎన్నికలకు చాలా దూరం ఉంది. అంతే కాదు కూటమి చేతిలో అధికారం అక్షరాల నాలుగున్నర నెలల దాకా ఉంది. దీంతో పాలన హాయిగా చేసుకోవచ్చు. కానీ ఏపీలో చూస్తే ఆ పరిస్థితి అయితే అసలు కనిపించడం లేదు. ఎందువల్ల అంటే అధికారం నుంచి రాజకీయం అలాగే రాజకీయం నుంచి అధికారం ఇలా ఈ రెండూ విడదీయలేని బంధంగా మారిపోయాయి. కేంద్రంలో చూసినా మోడీ అధికారంలో ఉంటూనే ఎపుడూ ఎన్నికల కోసం వివిధ రాష్ట్రాలలో పర్యటనలు రాజకీయ సభలతో బిజీగా ఉంటారు. దాని వల్లనే బీజేపీ క్యాడర్ కూడా నిరంతరం అలెర్ట్ అవుతూ ఉంటుంది. వారిలో ఆ వేడి కసి అలాగే ఉంటాయి. అందుకే వరస విజయాలకు బీజేపీకి దక్కుతున్నాయి. ఇపుడు ఈ సూత్రాన్ని ఏపీ రాజకీయ పార్టీలు కూడా గట్టిగా పట్టించుకున్నాయని అంటున్నారు. కొత్త ఏడాది 2025 వచ్చేసింది. ఆ తరువాత పెద్ద పండుగ సంక్రాంతి కూడా ముగిసింది. దాంతో రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్ జనంలోకి రావడానికి ముహూర్తం గతంలోనే పెట్టేశారు. ఆయన ప్రస్తుతం లండన్ టూర్ లో ఉన్నారు. ఆయన అక్కడ నుంచి ఏపీకి రాగానే ఫిబ్రవరి మొదటి వారం నుంచి జిల్లా పర్యటనలు స్టార్ట్ అవుతాయి. ప్రతీ జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించేలా జగన్ తన టూర్ ని రెడీ చేస్తున్నారు. ఆ మేరకు వైసీపీ యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధం చేసింది జగన్ జనం లోకి వస్తున్న టైం లోనే ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కూడా జనం లోకి వెళ్లాలని అనుకుంటున్నారు. ఆయన కూడా రానున్న రోజులల్లో క్షేత్ర స్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టబోతున్నారు. పవన్ తన రాజకీయ జీవితంలో విపక్ష పాత్రనే ఇంతకాలం పోషిస్తూ వచ్చారు. మొదటి సారి అధికారంలో ఉంటూ జనం లోకి రావడం అన్నది పవన్ కి కొత్త అనుభవం. దాంతో పాటుగా ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని చేతిలో ఉన్న అధికారంతో పరిష్కరించడం ద్వారా పార్టీ విస్తరణకు అలాగే రాజకీయంగా బలపడేందుకు మార్గం సుగమం చేసుకోవాలన్నది జనసేన నాయకత్వం ఆలోచనగా కనిపిస్తోంది అంటున్నారు. కట్ చేస్తే ఇపుడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా జనంలోకి రానున్నారు అని అంటున్నారు. ఆయన కూడా ఫిబ్రవరి నుంచి పార్టీ పటిష్టత మీద దృష్టి పెడతాను అని అంటున్నారు. ఆయన సైతం పార్టీని మరింతగా గట్టి పరచేందుకు క్యాడర్ కి దగ్గర అయ్యేందుకు తద్వారా ప్రభుత్వానికి పార్టీని మధ్య కనెక్టివిటీని మరింతగా పెంచేందుకు ఈ టూర్లను ఉపయోగించాలని చూస్తున్నారు. మొత్తం మీద చూస్తూంటే మరి కొద్ది రోజులలో జగన్ పవన్ లోకేష్ ఈ ముగ్గురు నేతలూ జనంలోకి రానున్నారు అని అంటున్నారు. దీంతో కొత్త ఏడాదిలో రాజకీయం వేసవి రాక ముందే హీటెక్కించే సూచనలు అయితే బలంగా కనిపిస్తున్నాయి.

## తెదేపా లో పదవులు పందేరం ప్రకటించిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కి ఇక కత్తిమీద సామే

● పనిచేసిన వారికే పదవులు ప్రకటనకు సంపూర్ణ న్యాయం జరిగేనా..... ● క్షేత్రస్థాయిలో డివిజన్ నాయకులు కృషి తోనే అఖండ విజయం అంశం గుర్తుండేనా ● పదవులు పందేరం తీనే తుట్టి కుట్టేదెవరినో.. పదవుల తీనే పట్టు దక్కేదెవరికో...

యేమినేని వెంకట రమణ

విజయవాడ పశ్చిమజనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ రాష్ట్ర రాజకీయ చరిత్ర కి నడిబొడ్డు లాంటిదే....ఆ విషయం రాష్ట్ర రాజకీయ పార్టీల ఓటమి గెలుపు లు గతంలో ఎన్నోసార్లు రుజువు చేసింది.అలాంటి నగరంలో చరిత్రలోనే మొట్టమొదటి సారిగా అనూహ్య మార్పులు చోటు చేసుకుంది. ఎవ్వరూ ఊహించని రీతిలో ఎన్డీయే కూటమి తరపున బీజేపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి ఘన విజయం సాధించారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి తరపున తెదేపా పాలనలో అప్పుడే 7 నెలలు గడిశాయి. ఇప్పటికీ ఈ నియోజకవర్గం ఇంచార్జి లేక దిక్కు మొక్కు లేకుండా ఉంది. కులమతాలకు అతీతంగా పశ్చిమ నియోజకవర్గ ప్రజలు బీజేపీ కి పట్టం కట్టారు. ఇన్నాళ్లూ అస్సలు ఇంచార్జి లేని ఈ నియోజకవర్గ పరిధిలోని చోటా మోటా నాయకులు గోడును ఎవ్వరూ పట్టించుకోకుండా గాలికి వదిలేసి పబ్బం గడుపుతూ వచ్చారు. బుధవారం తెదేపా జాతీయ కార్యదర్శి,రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ""పనిచేసిన వారికే పదవులు"" అంటూ ప్రకటించడం పశ్చిమ లోని డివిజన్ స్థాయి నుండి జిల్లా స్థాయి నాయకుల్లో కొత్తగా ఆశలు రేకెత్తిస్తోంది.ఐతే పశ్చిమ లో వర్గాలు మధ్య అంతర్గత ఆధిపత్య పోరు కొనసాగుతోంది. వీరందరి మధ్య డివిజన్ స్థాయి నాయకులు ""ఆ గట్టో ఈ గట్టో"" తేల్చికోలేని అంతర్మథనంలో కుంగిపోతున్నారు. ఇదిలావుండగా పశ్చిమ లో పంచ పాండవులు లాగా మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, పోలీసు హౌసింగ్ బోర్డ్ మాజీ ఛైర్మన్ నాగుల్ మీరా, పశ్చిమ రాజకీయ కురువృద్ధుడు, మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్, 28 సంవత్సరాలుగా తెదేపా పార్టీనే నమ్ముకొని పార్టీకి సేవలు అందిస్తున్న రాష్ట్ర మైనార్టీ సేల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్, తదితరులు నామినేటెడ్ పోస్టుల బరిలో ఉన్నారు. అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కర్ణుడులా కీలకమైన పాత్ర పోషించి సుజనా చౌదరి గెలుపు కోసం రాజకీయ పార్టీనాయకులను పార్టీ ఫిరాయింపుల పర్వంలో జయప్రదంగా నిర్వహించిన రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావుని కూడా అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. కాగా చోటా మోటా నాయకులు తమకు నామినేటెడ్ పదవులు ఇప్పించాలని విజయవాడ ఎమ్ పి కార్యాలయంలో ఇచ్చిన బయోడేటా లిస్టు కొండవీటి చాంతాడంత వుంది అందరికీ ఎమ్ పి ఇచ్చే సమాధానాలు ""ఒక్కటే అంతా అధిష్టానం ఇష్టమే""ఇలాంటి సమాధానం వస్తుందని కొందరు డివిజన్ స్థాయి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెలవక ముందేమో ఓటర్లు, నాయకులకు వంగి వంగి దండాలు పెట్టిన నాయకులు గెలిశాక చిన్న పెద్దా పదవులు కోసం తాము ఆశావహులతో వంగి వంగి దండాలు పెట్టించు కొంటున్నారు. ఈ ""పనిచేసిన వారికే పదవులు తీనే తుట్టి లో తేనెటీగలు కుట్టేదెవరినో.. తీనే పట్టు దక్కేదెవరికో"" అధిష్టానం వైఖరి ఎవరిని వరిస్తుందో ఎదురు చూడాల్సిందే......

## కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆధ్వర్యంలో గురజాల లో జనవరి 19వ తేదీన ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

**విజయవాడ పశ్చిమ జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గురజాలలో జన్మించిన వ్యక్తి తన జన్మభూమి రుణం తీర్చుకోడానికి ఆ ప్రాంత ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ తనకి వీలైనంత సాయం చేస్తూ, వైద్య సేవలు అందిస్తూ గుంటూరు పట్టణంలో మెదడు, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులుగా పేరుగాంచిన డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ తన సొంత ప్రాంత ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం గురజాల పట్టణము, పరిసర ప్రాంత ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు.భారతదేశవ్యాప్తంగా వైద్య రంగంలో ఎంతో ప్రసిద్ధి చెందిన కిమ్స్ హాస్పిటల్స్ ఇప్పుడు గుంటూరు లో కిమ్స్ శిఖర పేరుతో మంగళగిరి రోడ్డు లో ఏర్పాటు చేయడం జరిగింది, ఈ హాస్పిటల్లో నిష్ణాతులైన వైద్య బృందం, అత్యాధునిక వైద్య పరికరాలు, ఎటువంటి ఆరోగ్య సమస్యలకైనా కిమ్స్ శిఖర హాస్పిటల్స్ మీకు అందుబాటులో ఉంటుందని చిట్టెం లక్ష్మణ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ క్రమంలో కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరు గురజాల లోని ప్రభుత్వ హైస్కూల్లో 19 వ తేదీ జనవరి అనగా ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ఉచిత వైద్య సేవలు అందించేందుకు అన్ని రకాలుగా అన్యాయానికి చర్యలు చేపట్టారు. ఈ మెగా వైద్య శిబిరం లో గుండె,మెదడు,నరములు,పక్షవాతం,జీర్ణకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకులు మరియు కీళ్ల వ్యాధులు,జ్వరాలు, చిన్న పిల్లల వ్యాధులు, స్త్రీ మరియు ప్రసూతి వ్యాధులు,షుగర్, థైరాయిడ్, రక్తపోటు వంటి సమస్యలపై నిష్ణాతులైన సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు సేవలు అందిస్తారని ఆయన వివరించారు.డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో అగ్రశ్రేణి వైద్య నిపుణులు మరియు వైద్య సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొంటారు,ఈ మెగా వైద్య శిబిరం నందు ఉచితంగా చేయు వైద్య పరీక్షలు బీపీ, షుగర్,ఈసీజీ ఎకో (గుండె స్కానింగ్) బీఎండి (ఎముకల సాంద్రత పరీక్ష),బిఎంఐ పి ఈ టీ (ఊపిరితిత్తుల సామర్థ్య) పరీక్షలు నిర్వహిస్తారని ,అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని కిమ్స్ శిఖర హాస్పిటల్స్ మేనేజ్మెంట్ తెలియజేసింది.ఈ వైద్య శిబిరంలో పాల్గొనదరిచినవారు వారి పాత వైద్య పరీక్షల రిపోర్టులు వెంట తీసుకురావాలని సూచించారు.ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోనీ ఆరోగ్యాన్ని మెరుగుపర చుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారుఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ 83097 13983 కి ఫోన్ చేయాలని కోరారు.

## ఇళ్ల రిజిస్ట్రేషన్ కోసం కార్పొరేషన్లో రెండు సబ్ రిజిస్టర్ ఆఫీస్లు ఏర్పాటు

● కార్పొరేషన్ లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ఆఖరి తేదీ జనవరి 28 ● ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కార్పొరేషన్ లోనే రిజిస్ట్రేషన్

**విజయవాడ పశ్చిమ జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పాయకాపురం కాలనీస్ మరియు కొత్త రాజరాజేశ్వరి పేటలో ఇంకా వెయ్యి ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉన్నవి కాబట్టి వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్ లో రెండు సబ్ రిజిస్టర్ ఆఫీస్ లను ఏర్పాటు చేశారని ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా యజమానులుగా ఉంటున్న వారికి గజం 100 రూపాయలకు రిజిస్ట్రేషన్ చేయుటకు జనవరి 28వ తేదీ చివరి తేదీని, ఆసక్తి గల ప్లాట్ ఓనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్లో రెండు సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో ఏర్పాటు చేసి జనవరి 16 నుండి 28 వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు వచ్చి ఇక్కడ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోగలరని ఆయన తెలిపారు .ఎవరైతే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అనుకుంటున్నారో, వారు వారితోపాటు ఇంటి పట్టా, లింక్ డాక్యుమెంట్స్, యజమాని ఆధార్ కార్డ్, ఇంటి పన్ను రసీదు, ఇద్దరు సాక్షులు వారి ఆధార్ కార్డులతో ఇంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోగలరని తెలిపారు.

## ఏసీఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ ను కలిసిన టీమ్ ఇండియా క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి

**విజయవాడ పశ్చిమ జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్ర క్రికెట్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను విశాఖకు చెందిన టీమ్ ఇండియా క్రికెటర్ కె.నితీష్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని కేశినేని శివనాథ్ నివాసంలో ఆయన్ను నితీష్ కుమార్ రెడ్డి గురువారం కలవటం జరిగింది. ఏసీఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తో పాటు ఏసీఏ కార్యదర్శి రాజ్యసభ ఎంపి, సానా సతీష్ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి కి సాదర స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఎంపిలు ఇద్దరు నితీష్ కుమార్ రెడ్డిని శాలువాతో సత్కరించి వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహుకరించారు. ఈ సందర్భంగా నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ విశేషాలను పంచుకున్నారు. నితీష్ కుమార్ రెడ్డి ప్రతిభను చిన్నతనంలోనే గుర్తించి క్రికెట్ లో ప్రోత్సహించినందుకు నితీష్ కుమార్ రెడ్డి తండ్రి కె. ముత్యాల రెడ్డిని ఎంపిలు ఇద్దరు ప్రశంసించారు. తన తొలి టెస్ట్ మ్యాచ్ లో ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించి రికార్డ్ క్రియేట్ చేసిన నితీష్ కుమార్ రెడ్డి కి ఎంపి కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. ఎపిలోనే కాకుండా దేశవ్యాప్తంగా క్రికెట్ లో రాణించాలనుకునే ఎంతో మంది క్రీడాకారులకు నితీష్ కుమార్ రెడ్డి స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తన ఆటతీరును కొనియాడిన ఏసీఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ కు నితీష్ కుమార్ రెడ్డి



కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏసీఏ తరుపున మరింత మంది క్రికెటర్స్ ఇండియన్ క్రికెట్ టీమ్ , ఐపీఎల్ లో ఆడేందుకు ఏసీఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. యంగ్ క్రికెటర్స్ కి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వెంకట రామ ప్రశాంత్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, ఏసీఏ కౌన్సిలర్ దంతు గౌరు విష్ణుతేజ్, కె.ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

## ఈ పథకాలకు సంబంధించి పత్రాలు తప్పనిసరి

### కలువాయి ఎంపిడిఓ నరసింహారావు




**కలువాయి జనవరి 16 (వార్తాప్రభ)** శ్రీయుత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జిల్లా వెనుకబడిన తరగతులు సేవా సహకార సంఘం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు 2024 25 ఆర్థిక సంవత్సరానికి గాను కలువాయి మండలంనకు సంబంధించి బిసి కాపు మరియు ఇ.బి.సి వారికి కేటాయించిన లక్ష్యాలను శ్రీయుత జిల్లా కలెక్టర్ నెల్లూరు జిల్లా వారు మండలము మరియు బ్యాంకు బ్రాంచ్ వారీగా ఆమోదించడం జరిగినదని అలాగే ఈ వివరములు కార్పొరేషన్ వారీగా ఇందు వెంట జతపరచారని పై విషయంపై కలువాయి మండలం నందలి బీసీ ఇబిసి మరియు కాపు కులములకు లబ్ధిదారులకు పై పథకములకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులకు ఆధార్ కార్డు రేషన్ కార్డు మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రం కుల ధ్రువీకరణ పత్రం డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో మరియు ఫోన్ నెంబర్ తో ఏపీఓబి ఎంఎంఎస్ పోర్టల్ విడుదల కాగానే నమోదు చేసుకొనుటకు సిద్ధంగా ఉండాలని ఆయా లబ్ధిదారులకు కలువాయి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి నరసింహారావు తెలియజేశారు.

## పుష్పలతకు చేజర్ల యుటిఎఫ్ 20000 ఆర్థిక సహాయం



**చేజర్ల జనవరి 16 (వార్తాప్రభ)** యుటిఎఫ్ చేజర్ల మండల శాఖ ఆధ్వర్యంలో విద్యాఖర్చుల నిమిత్తం ఇడుపులపాయలో బీటెక్ చదువుతున్న యన్.వి. కండ్రిక గ్రామానికి చెందిన ఎస్.పుష్పలతకు గత నాలుగు సంవత్సరాల నుండి విద్యా ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేస్తున్నారు. అదే క్రమములో గురువారం చేజర్ల లోని యుటిఎఫ్ కార్యాలయంలో చేజర్ల మండల తహసిల్దార్ బి.మురళి ఎంపీడీవో విజయలలిత మరియు ద్వితీయ విద్యాశాధికారి మస్తానయ్య చేతుల మీదుగా పుష్పలతకి ?20,000 రూపాయలను అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం ఎంతో మంచి కార్యక్రమమని చేజర్ల యు.టీ.ఎఫ్ యూనియన్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో చేజర్ల మండల యుటిఎఫ్ నాయకులు రవిబాబు రమణయ్య వెంకటకృష్ణారెడ్డి ఏ.సుబ్రహ్మణ్యం జి సుబ్రహ్మణ్యం వెంకటేశ్వర్లు బుజ్జయ్య ఆదిశేషయ్య తనూజ వెంకటసుబ్బమ్మ వెంకట రమణమ్మ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయు లకు యు.టి.ఎఫ్ చేజర్ల మండల శాఖ వారు ధన్యవాదములు తెలియజేశారు.

## అమ్మ చిరు హెచ్చరికలు



పరిధి లేని స్వార్ధము
కాటేసే సర్పము
వీడినచో క్షేమము
లేదంటే నష్టము
శృతిమించిన ఆశలు
మది నిండా కక్షలు
పోగొట్టును శాంతిని
నలిపివేయు మనిషిని
గుండెలోని కలతలు
తగలబెట్టు నిప్పులు
ఆదిలోన దూరము
చేసుకున్న క్షేమము
తేలు కొండి వ్యసనము
హానికరము కపటము
ఎప్పుడైనా మోసము
తెలుసుకో! ఈ నిజము

గద్వాల సోమన్న,
9966414680

## దయాలసిస్ పేషంట్స్ కు మెరుగైన వైద్యం అందించాలి

### ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి





**కనిగిరి జనవరి 16 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో గురు వారం డయాలసిస్ కేంద్రాన్ని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి డయాలసిస్ కి వచ్చే పేషెంట్లకు ఎటువంటి ఇబ్బందులకు రాకుండా చూడాలని మరియు అక్కడ సౌకర్యాలను గురించి డయాలసిస్ పేషంట్ల ను, కిడ్నీ సంబంధిత పేషంట్లను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పరికరాల ద్వారా వైద్య సేవలను మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన ప్రభుత్వ వైద్యశాలలో సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆరు నెలల వ్యవధిలో దాతల సహకారంతో కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ తిరుపతిరెడ్డి, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, హెచ్ డి ఎస్ కమిటీ సభ్యులు, రహిమాన్, బుల్లా బాల బాబు, కోమలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపా సభ్యత్వం రాష్ట్రంలో కోటి మైలురాయి దాటించిన వారికి కోటి దండాలు

### దళిత రత్న పరిశపోగు రాజేష్



**విజయవాడ పశ్చిమ జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో ఆంధ్రప్రదేశ్ లోనే కోటి మైలురాయి దాటించిన రాష్ట్ర ప్రజలకు దళిత రత్న పరిశపోగు రాజేష్ గురువారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెదేపా సభ్యత్వం తీసుకొన్న వారికి, క్షేత్ర స్తాయిలో బాధ్యతగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తెదేపా నాయకులకు రాజేష్ కోటి దండాలన్నారు. పైగా ప్రజలు పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకొని తెలుగుదేశం పార్టీ మీద ఉన్న విశ్వాసనీయతను విధేయతను తెలియజేశారని ఐ టీడీపీ సభ్యులకు అవకాశం కల్పించిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అదేవిధంగా తెలుగుదేశం అధిష్టానం పిలుపుమేరకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ఇంతటి ఘన విజయాన్ని అందించిన నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు కృతజ్ఞతలు మరోసారి తెలియజేసుకుంటున్న దళితరత్న పరిశపోగు రాజేష్ తెలిపారు.

## జనవరి 19న చలో మానుకోట కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టి యు ఎఫ్) మండల అధ్యక్షులు తాళ్ల మల్లయ్య గౌడ్



**తొర్రూర్ జనవరి 16:(వార్తా ప్రభ)**ఈనెల 19 జరగబోయే చలో మానుకోట ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తొర్రూర్ మండల అధ్యక్షులు తాళ్ల మల్లయ్య గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు బుద్ధసాని వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. జనవరి19న మానుకోట పట్టణంలో ఉద్యమకారుల ఆత్మ గౌరవ సదస్సుకు మండలం నుండి ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కొండ వెంకన్న, డివిజన్ అధ్యక్షులు ఆనాపురం వెంకన్న గౌడ్, డివిజన్ గౌరవ అధ్యక్షులు గుద్దేటి మల్లయ్య, వాసిరెడ్డి నరసింహారెడ్డి, మన్యం వెంకన్న, ప్రతాపని లక్ష్మయ్య, కోదునూరి సుధాకర్, ఏర్పుల వెంకన్న, మంగళపెల్లి నాగరాజు, పంతం సురేందర్, పంజాల బుచ్చి రాములు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపప్పూరు మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీ

**తాడిపత్రి జనవరి 16:(వార్తా ప్రభ)**పెద్దపప్పూరులోని మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి గురువారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. ఉద్యోగుల, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు.

# రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ. 10,000 జరిమానా

- ట్రాఫిక్ సమస్యలకు మూల కారణం గో సంచారం ఒక కారణమే
- మోటారు వాహనాలు ఢీ కొని తీవ్ర గాయాల పాలౌతున్న మూగ జీవాలు
- ఇకనైనా ఖచ్చితంగా అమలు జరగాలని స్థానికుల విజ్ఞప్తి

(యేమినేని వెంకట రమణ )

**విజయవాడ పశ్చిమ జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ. 10,000 జరిమానా విధించనున్నట్లు ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం, ప్రమాదాలు సంభవించడం, ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ చర్యల్లో భాగంగా, ఆవులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్ సింగ్ నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాటిల్ షెడ్ లో గోవుల ఆరోగ్య సంరక్షణ కోసం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్. రెడ్డి పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు.ప్రజలందరూ రోడ్లపై పశువులను వదిలిపెట్టకుండా సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, పర్యావరణం పరిరక్షణే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని అన్నారు. కాగా సుమారు ఆరు నెలల క్రితమే మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు నగరంలో గో సంచారంపై హెచ్చరికలు జారీ చేశారు. ఐతే కారణం ఏదైనా గానీ అధికారులు హెచ్చరికలు ఎవ్వరూ పట్టించుకోకుండా గోవులను యధేచ్ఛగా గోవులను రోడ్డుపై వదిలేసి పైసా ఖర్చు లేకుండా అవు పాలను పిండుకొని డబ్బులు దండుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఆవులకు ప్రకృతి సహజంగా లభించే పోషకాలు అందించ కుండా వాటి ఆరోగ్య పరిస్థితి పై ఆరా తెసేవారే లేరు. పశువులు పచ్చగడ్డి, ఎండుగడ్డి, తెలుగ చెక్క, ఉలవలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పశువుల దాణా తయారీ కంపెనీలు తయారు చేసిన దాణా మాత్రమే గోవులకు అందించాలనే ప్రాథమిక ఆరోగ్య సూత్రాలు కూడా పాటించని గోవుల యజమానులు పైసా ఖర్చు లేని మార్గాలు ఎంచుకుంటుంటారు. పైగా నగరంలో గో ప్రేమికులు పెట్టే ఆహారం కూడా నిబంధనలకు భిన్నంగా ఉంటుంది. మిగిలి పోయిన పిండి పదార్థాలు, చపాతీ, పరోటా, చద్దన్నం ,కుళ్లిన అరటి పండ్లు, తదితరాలు గోవులకు తినిపిస్తున్నారు. ఆ విధానం మారాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఆవులు రోడ్డుపై అడ్డంగా బైఠాయించి ట్రాఫిక్ జామ్ సమస్యలకు కారణమవుతున్నాయి. పాతబస్తీలో ఇటీవల ఓ ఎద్దుని గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. సకాలంలో దానికి వైద్య సాయం అందలేదు. స్వయంగా విలేకరులు అధికారులకు సమాచారం అందించినా ఫలితం లేదనే విమర్శలు వచ్చిపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విఎంసి అధికారులు గో సంచారంపై వాటి యజమానులకు జరిమానా విధించడం అభినందనీయమే......







## శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో ఘనంగా పార్వేట ఉత్సవం

**తిరుపతి :జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో గురువారం పార్వేట ఉత్సవం ఘనంగా జరిగింది. ప్రతి ఏడాదీ సంక్రాంతి కనుమ పండుగ మరునాడు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజస్వామి వారు, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రేణిగుంట రోడ్డులోని పార్వేట మండపానికి ఊరేగింపుగా తీసుకెటళ్లారు. అక్కడ ఆస్థానం నిర్వహించారు. స్వామివారి వేటను తిలకించడానికి పార్వేట మండపానికి విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసారు. తిరిగి నగరవీధుల్లో ఊరేగింపుగా ఉత్సవమూర్తులను సాయంత్రం 6 గంటలకు ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో టిటిడి స్థానిక ఆలయాల డెప్యూటీ ఈవో శాంతి, ఆలయ అర్చకులు, ఇతర అధికార ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డ్ డిజిటలైజేషన్ పై ఏపీ ఆన్లైన్ వారితో అబ్దుల్ అజీజ్ సమావేశం.

**గత ప్రభుత్వం అర్ధాంతరంగా ఆపేసిన దాన్ని తిరిగి పునః ప్రారంభిస్తాం.**
**- షేక్. అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్.**



**విజయవాడ, జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**టీడీపీ హయాంలో చేపట్టిన వక్ఫ్ బోర్డ్ డిజిటలైజేషన్ కు గత వైసిపి ప్రభుత్వం మెయింటెనెన్స్ నిధులు విడుదల చేయక అర్ధాంతరంగా ఆగిపోయింది. దానిని పునఃప్రారంభించేందుకు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఏపీ ఆన్లైన్ వారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో గతంలో డెవలప్ చేసిన అసెట్, లీగల్, లీజు, రెంట్, ఈ టెండరింగ్, గవర్నమెంట్ స్కీమ్స్ మాడ్యూల్స్ గురించి వివరంగా చర్చించి వాటిని మరింత అభివృద్ధి చేసి జిఐఎస్/ జిపిఎస్ మ్యాపింగ్ చేసి వక్ఫ్ ప్రాపర్టీస్ కి జియో ఫెన్సింగ్ చేసే విధంగా డెవలప్ చేయాలని సూచించారు. పాత బకాయిలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో చర్చించి మళ్లీ వీటిని వాడుకలోకి తెస్తామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్లో ఏపీ ఆన్లైన్ నుంచి రాజా, రమేష్, గోపీనాథ్, నూర్ అహ్మద్, వక్ఫ్ బోర్డ్ నుంచి సీఈవో అబ్దుల్ ఖాదిర్, పాల్గొన్నారు.

## క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డిని అభినందించిన మంత్రి నారా లోకేష్



**విజయవాడ జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ , ఏసీఏ కార్యదర్శి రాజ్య సభ ఎంపి సానా సతీష్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గావస్కర్ సిరీస్‌లో సత్తా చాటిన వైజాగ్ కి చెందిన నితీష్ కుమార్ రెడ్డి గురువారం ఉండవల్లిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నివాసంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డిను అభినందించి శాలువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహుకరించారు. నితీష్ కుమార్ రెడ్డి తో మాట్లాడి తన క్రికెట్ విశేషాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో యువ క్రీడాకారులకు సహకారం అందించాలని సూచించారు. అలాగే ఏసీఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి రాజ్య సభ ఎంపి సానా సతీష్ లతో క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా వుంటుందని తెలిపారు. నితీష్ కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని విజయాలతో పాటు సరికొత్త రికార్డ్స్ సాధించాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారుఈ కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వెంకట రామ ప్రశాంత్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, ఏసీఏ కౌన్సిలర్ దంతు గౌరు విష్ణుతేజ్, కె.ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

## మానసిక, శారీరక దృఢత్వాన్ని క్రీడల వల్ల సాధించవచ్చు

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- అనునిత్యం విధులలో ఉండే పోలీసులకు వార్షిక క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయి.
- అట్టహాసంగా ప్రారంభం అయినా వార్షిక జిల్లా పోలీసు క్రీడలు
- రెండు రోజులపాటు కొనసాగనన్న క్రీడా పోటీలు.
- వాలీబాల్, రన్నింగ్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచిన జిల్లా ఎస్పీ

**జగిత్యాల,జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)::**:క్రీడలతో స్నేహ భావం పొందడంతో పాటు పని ఒత్తిడి నుండి రిలీఫ్ అవడానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అనునిత్యం విధులలో, నిరంతరం పనిలో నిమగ్నమైన జిల్లా పోలీసులకు ఆటవిడుపుగా జిల్లా పోలీసు వార్షిక క్రీడలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈరోజు ఉదయం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానం నందు జిల్లా ఎస్పీ గారు పాల్గొని పోలీసు క్రీడలను ప్రారంభించారు. మొదటగా క్రీడలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. తదుపరి పరేడ్ మైదానం నందు జిల్లాలోని నాలుగు బృందాలుగా ఉన్నటువంటి ఉంటూ చక్కటి పరేడ్ ను నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనాన్ని అందజేయడం జరిగింది. తదుపరి స్పోర్ట్స్ జెండాను అధికారుల సమక్షంలో ఎస్పి ఆవిష్కరించడం జరిగింది. స్పోర్ట్స్ ప్రారంభమైనట్లు తెలియజేస్తున్నటువంటి బెలూన్లను గాలిలోకి వదిలి జిల్లా పోలీసు వార్షిక క్రీడలను ప్రారంభించారు. అదేవిధంగా క్రీడాజ్యోతిని క్రీడాకారులైనటువంటి వారు పరిట మైదానం చుట్టూ తిరిగి ఎస్పి గారికి అందజేయగా వారు క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం క్రీడాకారులచే ఎలాంటి రాగద్వేషాలు లేకుండా నిష్పక్షపాతంగా క్రీడలను ఆడతామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. మొదటగా క్రీడా పోటీలలో పాల్గొననున్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలియజేస్తూ, క్రీడలు ఆడే స్ఫూర్తి గొప్పదని ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడుతూ మానసిక శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఇలాంటి క్రీడా పోటీల లోనే ప్రతి ఒక్కరి ప్రతిభ కనబడుతుందని తెలియజేశారు. క్రీడలలో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనవలసిందిగా తెలియజేశారు. ప్రతిరోజు విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఆటవిడుపుగా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహిస్తారని వాటిలో ప్రతి ఒక్కరూ పాల్గొని మానసిక



ఉల్లాసాన్ని పొందవలసిందిగా తెలిపారు. ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగుల మధ్య సఖ్యత పెరిగి, విధులలో కలిసిమెలిసి పనిచేస్తూ ఉండడం జరుగుతుందని తెలిపారు.తదుపరి రన్నింగ్, వాలీబాల్ క్రికెట్ క్రీడలను జిల్లా ఎస్పీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించి ఉత్సాహపరిచారు. ముఖ్యంగా ఈ క్రీడలు రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు అందులో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాట్మెంటన్, అథ్లెటిక్స్, క్యారం, చెస్ లాంటి వివిధ అంశాలలో ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్ రావు, డిఎస్పీ లు రఘుచందర్, రాములు ,రంగా రెడ్డి ,ఏవో, శశికల,డీసీఆర్బీ,ఎస్బీ,ఐటీ కోర్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్, రఫీ ఖాన్, సి.ఐ లు రాం నరసింహారెడ్డి, వేణుగోపాల్,రవి,కృష్ణారెడ్డి, నిరంజన్ రెడ్డి ,సురేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు కిరణ్ కుమార్,రామకృష్ణ, వేణు, ఎస్. ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

NOTICE
In the Court of the
Prl. District Sessions Judge
At Machilipatnam
Crl. M.P. No. 386/2024
In
Crl. A /2025
Between :-
Smt. Velpuri Asha Jyothi
... Petitioner/Appelent
Vs
Velpuri Mahesh And Others
... Respondents/Respondents
To
Velpuri Mahesh, S/o. Anjaneyulu,
Male, Aged About 37 Years,
A.C. Mechanic, R/o. 61-9/4-15,
Poorna Chandra Nagar,
Krishna Lanka, Vijayawada.

పై నంబరు పిటీషన్‌ను, మీపై, మరియు ఇతర రెస్పాండెంట్స్‌పై దాఖలు చేయగా, మీరు సదరు పిటీషన్ యొక్క నోటీసు తీసుకొనక అనేక వ్యాయములు కాలయాపన చేయుచున్న దరిమిలా శ్రీ కోర్టు వారు ది. 7-1-2025 తేదీన పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయమని ఆర్డర్ వేసిన దరిమిలా, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయబడినది. కావున మీరు సదరు పిటీషన్‌పై ఎలాంటి అభ్యంతరములు ఉన్న యెడల, స్వయముగా గాని, మీ తరపున ప్లీడరు గారి ద్వారా గాని మీ అభ్యంతరములను ది. 20-01-2025 తేదీ ఉదయం 10-30 గంటలకు శ్రీ కోర్టు వారు ముందు హాజరై తెలియచేయగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయబడునని తెలియజేయుచున్నాము.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
ఇట్లు
**K.J. దయానంద్ కుమార్**
**G. అభిషేక్**
న్యాయవాదులు
విజయవాడ.
సెల్ : 9885949656
మచిలీపట్నం.
15-1-2025

## లబ్ధిదారుల కు సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

**రాజన్న సిరిసిల్ల, జనవరి 16: నేటి మన దేశమ్ ప్రతినిధి** సిరిసిల్ల పట్టణంలో గురువారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక వార్డు కౌన్సిలర్ శైలు-శ్రీకాంత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న తక్కువ సమయంలోనే సీఎం రిలీఫ్ ఫండ్ రావడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, స్థానిక వార్డు కౌన్సిలర్ శైలు శ్రీకాంత్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## మరోమారు రైతుజాతాకు సిద్ధమవుతున్న రైతులు

**- 21 నుంచి పునఃప్రారంభిస్తున్న సంఘాల నేతలు ప్రకటన**



**చండీగఢ్ :** ఈ నెల 21 నుండి రైతు జాతాను పున:ప్రారం భించనున్నట్లు రైతు సంఘాలు ప్రకటించాయి. పంజాబ్ హర్యానాల మధ్య శంభుసరిహద్దు నుండి 101 మంది రైతుల బృందం ఢిల్లీమార్చ్ చేపట్టనుందని కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) నేత సర్వాన్‌సింగ్ పంధేర్ గురువారం ప్రకటిం చారు. 21 నుండి 101 మంది రైతులతో జాతాను పున:ప్రారం భించాలని సంయుక్త కిసాన్ మోర్చా, కెఎంఎంలు నిర్ణయించినట్లు తెలిపారు. గత 11 నెలలుగా శంభు, ఖన్నౌరిల్లో దీక్ష చేపడుతున్నప్పటికీ .. రైతుల డిమాండ్లను కేంద్రం ఆమోదించడం లేదని సర్వాన్‌సింగ్ మండిపడ్డారు. రైతులతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా లేదని, ఆందోళనను మరింత తీవ్రతరం చేయాలన్నది రెండు సంఘాల నిర్ణయమని అన్నారు. గత 50 రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌కి సంఘీభావంగా 111 మంది రైతుల బృందం కన్నౌరీ సరిహద్దులో ఆమరణ దీక్ష చేపట్టిన మరుసటి రోజు ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. డిసెంబర్ 6, డిసెంబర్ 8 మరియు డిసెంబర్ 14 తేదీలలో 101 మంది రైతులతో కూడిన జాతా శంభు సరిహద్దు నుండి ఢిల్లీ వెళ్లేందుకు యత్నించిన సంగతి తెలిసిందే. ఈ మూడు ప్రయత్నాల్లో రైతులపై భద్రతా బలగాలు, హర్యానా పోలీసులు టియర్‌గ్యాస్, షెల్స్‌ను ప్రయోగించాయి. దీంతో దాదాపు 50 మంది రైతులకు గాయాలయ్యాయి. డిసెంబర్ 14న ఈ జాతాలో పాల్గొనని ఓ రైతు విషం తాగాడు.

## 1997-98. పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమావేశం.



**రెడ్డిగూడెం జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రెడ్డిగూడెం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 1997-98. పూర్వపు పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం మంచి సంతోష కరంగా ఆహ్లాద కరమైన వాతావరణంలో ఘనంగా కార్యక్రమం జరిగినది. ఈ ఆత్మీయ సమావేశం గడిచిన 25 సంవత్సరాల లో ఇది మూడోసారి కావడం అందరూ సమావేశం అవడం వలన ఒకరికొకరు సంతోషం వ్యక్తం చేసుకుంటూ గడిచిన ఇన్ని సంవత్సరాలలో కలుసుకోవడం ఉభయకు శలాలు అడిగి తెలుసుకుని ఎవరు ఏ వృత్తి లో ఉన్నారని తెలుసుకొని ఒకరినొకరు వారి యొక్క అలనాటి సంఘటనలు పంచుకుంటూ ఆనందంగా సాయంత్రం వరకు గడపడం జరిగింది.ఈ 1997-98. పదవ తరగతి ఆత్మీయ సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆనాటి ఉపాధ్యాయులుగా పనిచేసిన లెక్కల మాస్టర్ నాగేంద్ర ఫణి, హిందీ ఉపాధ్యాయులు. లుక్క శ్రీనివాసరావు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ధర్మశీల. పాల్గొన్నారు. ఈ ఆత్మీయ సమావేశం గురించి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలుగా మమ్మల్ని మరిచిపోనందుకు చాలా సంతోషంగా ఉందని మా పైన మీకున్న ప్రేమను మేము ఎన్నటికీ మరువరాని తీపి జ్ఞాపకం గా ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి వినయ, విధేయతలు ఇప్పటికీ ఉండడం ఇప్పటి తరానికి ఆదర్శంగా ఉంటుందని, మీరు మా విద్యార్థులు అయినందుకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. మీరు అన్నివేళలా సుఖ సంతోషాలతో మీ కుటుంబాలతో చల్లగా ఉండాలని దీవించడం జరిగింది.

## షటల్, క్యారమ్స్, టెన్నికాయిట్, కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



**రెడ్డిగూడెం జనవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి):**రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెం గ్రామంలో కీర్తిశేషులు మన్నె ప్రభుదాసు, జయకుమార్, శ్రీను గార్ల జ్ఞాపకార్థం "ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ" ఆధ్వర్యంలో యువకులకు షటల్, క్యారమ్స్, మహిళలకు టెన్నికాయిట్, కబడ్డీ పోటీలు ప్రారంభం అయినాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 18 వ తేదీన జరిగే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవ జి విశ్వనాథ్, మన్నె శాంతి కుమార్ మాష్టారు. బండపల్లి ప్రేమ్ కుమార్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు

## వెస్ట్ ట్రాఫిక్ విభాగంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు



**గుంటూరు జనవరి 16 (వార్తాప్రభ ప్రతినిధి):-** గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలో గల జి.టి.రోడ్డలో ఉన్న మస్తాన్ దర్గా వద్ద హజరత్ కాలే మస్తాన్ షా 133వ ఉరుసు గంధ మహోత్సవ కార్యక్రమము ఈనెల 17వ తేది శుక్రవారం నాడు ప్రారంభమై 21వ తేది మంగళవారం నాటితో ముగింపు వరకు అనగా ఐదు రోజులపాటు భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవోపేతంగా జరుగుతున్న దృశ్యా యం.టి.బి పాయింట్ నుంచి చుట్టుగుంట వైపుకు వెళ్ళే ఆయా వాహనదారులు యథావిధిగా తమ ప్రయాణాన్ని కొనసాగించవచ్చునని...చుట్టుగుంట వైపు నుండి పట్టణములోనికి వచ్చే వాహనదారులు నగరంపాలెం పోలీస్ స్టేషన్ రోడ్డులో కుండా తమ రవాణాన్ని విధిగా కొనసాగించి వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ వారి విజ్ఞప్తిని అటు ప్రజలు ఇటు ఆయా వాహనదారులు తమ పరిగణలోనికి తీసుకుని వెస్ట్ ట్రాఫిక్ పోలీసులకు సహకరించగలరని వెస్ట్ ట్రాఫిక్ సి.ఐ సి.హెచ్.సింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రకాశం జిల్లాలో విషాదం.. సముద్రంలో ఆరుగురు గల్లంతు



**ఒంగోలు, జనవరి 16:(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రకాశం జిల్లా సింగరాయకొండలో విషాదం చోటు చేసుకుంది. సింగరా యకొండ మండలం పాకల బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లిన ఆరు గురు గల్లం తయ్యారు.వెంటనే సమాచారం అందుకున్న మెరైన్ పోలీసులు.. స్థానిక మత్స్యకారుల సాయంతో గల్లంతైన వారి కోసం గాలింపు చేపట్టారు. ఇద్దరు బాలికలు, యువకుడి మృతదేహాలు లభ్యం కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులు పొన్నలూరు మండలం శివన్నపాలెంకు చెందిన నోసిన జెస్సిక (15), నోసిన మాధవ (25), కందుకూరు మండలం కొల్లగుంట గ్రామానికి చెందిన యామిని (16)గా గుర్తించారు. గల్లంతైన మరో ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోంది.

# తల్లిదండ్రులను భారంగా కాకుండ బాధ్యతగా చూసుకోవాలి..

● వృద్ధాశ్రమంలో నూతన వస్త్రాలు పంపిణీ చేసి.. అన్నదానం చేసిన బిజెపి మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ సూరే గాంధీ



**గుడివాడ,జనవరి 16 (వార్తాప్రభ) :** ఇక మీదట ఎవరైనా తల్లిదండ్రులను భారంగా భావించవద్దని బాధ్యతగా చూసుకోవాలని ఈ జన్మలో తండ్రిని మించిన హీరో లేడని తల్లిని మించిన దేవత లేదని ప్రతి ఒక్కళ్ళు భావించాలని.. సంక్రాంతి సందర్భంగా పామర్రు -వాసవివృద్ధ శరణాలయం నందు భారతీయ జనతా పార్టీ (బిజేపి) మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ సూరే లక్ష్మీనారాయణ (గాంధీ) నూతన వస్త్రాలు అందజేసి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఇప్పుడున్న అటువంటి పరిస్థితులలో కేవలం 70 పరమావధిగా మనిషి ఆలోచనలు మార్పు రావటం వలన విదేశీ సంస్కృతి పెరిగి మన దేశ సంస్కృతి సంప్రదాయాలకు విరుద్ధంగా ఇలా తల్లితండ్రులని వృద్ధులని ఇలా ఆశ్రమంలో ఉంచటం చాలా బాధాకరమని అవేదన వ్యక్తం చేశారు. వీళ్లను ఆశ్రమ నిర్వాహకులు తమ కుటుంబ సభ్యులుగా భావించి ఎంతో బాగా చూస్తున్నారని వారికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో మన వ్యవస్థలో ఉమ్మడి కుటుంబం తద్వారా కుటుంబంలో ఏ ఒక్కరు ఇబ్బంది రాకుండా మిగతావాళ్లు తమ ఆలనా పాలన చూసుకుని వారిని అలాంటి వ్యవస్థ మళ్లీ రావాలని మళ్లీ ఈ దేశం ఉమ్మడి కుటుంబాల వ్యవస్థతో కడకల్లాడాలని దయచేసి ఇకమీదట ఎవరైనా ఇలా తమ పెద్ద వారిని ఆశ్రమాలలో వదలకుండా కనపడే దేవీ దేవతలుగా చూసుకోవాలని గాంధీ కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఘంటసాల భరతుడు, ఆర్యవైశ్య ప్రముఖులు మానేపల్లి రఘురాం, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మానేపల్లి సత్యసాయి, జిల్లా బిజెపి నాయకులు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణవాశ్రమం గోశాలకు దాణా అందజేత



**గుడివాడ,జనవరి 16 (వార్తాప్రభ) :** లయన్స్ క్లబ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యాన ప్రణవాశ్రమం పర్యవేక్షణలోని గాయత్రి గోశాలకు లయన్స్ క్లబ్ ప్రగతి సీనియర్ సభ్యులు ఆర్. మురళీధర్ 3 వేల రూపాయల విలువైన దాణా కట్టలు, అరటిపండ్లు, తెలగపిండి తదితర వాటిని అందజేశారు. మురళీధర్ తల్లి సత్యవతి చేతుల మీదుగా వీటిని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్థైర్యానంద సరస్వతి స్వామివారు దాతలకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి అధ్యక్షులు ఎన్.ఎస్. రావు, లయన్స్ నేతలు ఎంవిఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 17న శ్రీ లక్ష్మీ గణపతి హెూమం..

**గుడివాడ,జనవరి 16 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా, గుడివాడ టౌన్ మెయిన్ రోడ్ లో వెంచేసి యున్న శ్రీ విగ్నేశ్వర స్వామి వారి దేవస్థానములో ది. 17.01.2025. శుక్రవారం సంకష్ట హర చతుర్థి సందర్భముగా శ్రీ స్వామి వారి ఆలయ ఆవరణలో శ్రీ లక్ష్మీ గణపతి హెూమం పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహ్నధికారి వై. శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్ లు పేర్కొన్నారు. ఈ క్రమంలో భక్తులు రు. 516/-లు పూజారుసుము చెల్లించి మీయొక్క గోత్ర నామములు నమోదు చేయించు కొనవలసినదిగా సదరు ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ విగ్నేశ్వర స్వామి వారి దేవస్థానము కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ది గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "సంక్రాంతి సంబరాలు"







**గుడివాడ,జనవరి 16 (వార్తాప్రభ) :** మూడు రోజుల ముచ్చటైన తెలుగువారి పండుగ సంక్రాంతి ముగిసింది. ఆదివారం భోగి, సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. పలు దేవాస్థానాల్లో గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ క్రమంలో పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పట్టణమంతా అంతటా సందడి వాతావరణ కనిపించింది. పై కార్యక్రమాల్లో ది గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు యమ్. దీవెన, సెక్రటరీ వి. ప్రతిమ మరియు ట్రెజరర్ యమ్. కృష్ణకుమారీ లు తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న బొమ్మల కొలువు.. :** సంక్రాంతి సంబరాల్లో బొమ్మల కొలువులు కూడా భాగమే.. తెలుగు వారీ తొలు పండుగ సందర్భంగా ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి చుట్టు పక్కల వారిని ఆహ్వానించే ఆనవాయితీ క్రమంగా కనుమరుగు అవుతోంది. బొమ్మల కొలువులో దేవుని బొమ్మలైన వినాయకుడు గణపతి, రాముడు, కృష్ణుడు, లక్ష్మి, సరస్వతి, పార్వతి, స్వాతంత్ర్య సమరయోధుల బొమ్మలు, పెళ్ళితంతు బొమ్మలు, హాస్య బొమ్మలు మొదలగునవి. దేవుళ్ళ బొమ్మలతో పాటు బొమ్మల కొలువులో తప్పకుండా పెట్టే బొమ్మలు కొన్ని ఉంటాయి.. ఈ మూడు గుణాలను అధిగమించిన వారికి దేవీ కటాక్షము లభ్యమవుతుందని పేర్కొన్నారు.

**భోగి పండుగ అంటేనే పిల్లల పండగ.. :** ఈ భోగి పండుగనాడు సంబరమంతా పిల్లలదే. కొత్త బట్టలు ధరించి భోగి మంటల్లో భోగి పిడకలు వేయడంతో భోగి సంబరాలు మొదలవుతాయి. సాయంత్రం భోగిపండ్లు పిల్లలకు భోగి పండ్లు పోస్తారు. చిన్న పిల్లలను సాక్షాత్తు శ్రీమన్నారాయణుడినిగా భావిస్తూ.. భోగి రోజు సాయంత్రం పిల్లలకు భోగి పళ్ళను పోస్తారు. భోగి పళ్లలో చేమంతి, బంతి పువ్వుల రేకులు, అక్షింతలు, చిల్లర నాణేలు కలిపి పిల్లల.. పిల్లలకు దిష్టి తీసి వాటిని తలపై పోస్తారు. భోగి రోజున ఈ పళ్లను పిల్లల తల మీద పోయడం వలన శ్రీ లక్ష్మీనారాయణుల అనుగ్రహం తమ పిల్లలపై ఉంటుందని నమ్మకం.. అంతే కాదు తమ పిల్లల తలపై ఈ భోగి పండ్లును పోయడం వలన వారు జ్ఞానవంతులవుతారని, ఆరోగ్యంగా జీవిస్తారని పెద్దల నమ్మకమని తెలిపారు.

# టీడీపీ గొప్ప విజయం..

● టీడీపీ ద గ్రేట్... ● కోటి 49 వేల సభ్యత్వంతో రికార్డ్... ● ప్రపంచంలో ఏ స్థానిక పార్టీకిలేని ఆదరణ... ● చంద్రబాబు, లోకేష్ లపై నమ్మకానికి ఇది ప్రతీక... ● ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా... ● కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత... ● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్...



**అమరావతి,జనవరి 16 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కోటి 49వేల సభ్యత్వంతో గొప్ప విజయం సాధించిందని తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ ఆనందం వ్యక్తం చేశారు. అమరావతి లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కోటి 49వేల సభ్యత్వంతో తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఓ రికార్డ్ సృష్టించిందని ఆయన తెలిపారు. ఈ కోటి 49వేల మంది కార్యకర్తలకు రూ.5 లక్షల చొప్పున ప్రమాదబీమా పార్టీ కల్పించినట్లు ఆయన చెప్పారు. పార్టీ కార్యకర్తలకు టీడీపీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రపంచంలో ఎక్కడా ఒక ప్రాంతీయ పార్టీకి కోటి సభ్యత్వం లేదన్నారు. ఇది తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృషి, పట్టుదల వల్లే ఇది సాధ్యమైందన్నారు. పార్టీ శాశ్వత సభ్యులుగా 145 మంది లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకోవడంలో మంగళగిరి నియోజకవర్గం చరిత్రలో నిలిచిందని ఆయన తెలిపారు మొదటి స్థానంలో మంగళగిరి నియోజకవర్గం నిలిచిందని, రెండవ స్థానంలో ఆత్మకూరు నియోజవర్గంలో 135 మంది, మూడో స్థానంలో వినుకొండ నియోజవర్గంలో 79 మంది, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో 62 మంది తణుకులో 60 మంది శాశ్వత సభ్యత్వం తీసుకున్నారని ఆయన తెలిపారు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీకి ఓ బ్రాండ్ గా నిలిచి, ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం, పరిశ్రమల స్థాపన, లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, నూతన పారిశ్రామిక ఆవిష్కరణలతో అమరావతిలో దూసుకుపోతున్న ఫలితమే ఇదని అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలు, ముఖ్యంగా యువత చంద్రబాబు నాయుడుపై, కూటమిపై ఎంతో నమ్మకం ఉంచి ఎన్నికల్లో అఖండ విజయం సమకూర్చారని ఆయన చెప్పారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా చంద్రబాబు రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవిరళ కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. టీడీపీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక అంశాలపై చంద్రబాబు లోకేష్ లు దృష్టి సారించి అనేక లక్ష్యాలను సాధించారన్నారని ఆయన తెలిపారు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్ లు ఒకటవ తేదీనే ఇవ్వడమే కాకుండా, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ని రూ.4వేలకు పెంచినట్లు ఆయన వివరించారు. అలాగే, విద్యార్థుల ఫీజు రీఇంబర్స్ మెంట్ నుంచి ఆరోగ్యశ్రీ, కాంట్రాక్టర్ల బకాయిల వరకు చెల్లించుకుంటూ వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాలనలో ఈ విజయపరంపరే తెలుగుదేశం పార్టీలో కోటి మంది కార్యకర్తలుగా చేరడానికి కారణమని పాతర్ల రమేష్ తెలిపారు. ఈ విజయోత్సవాన్ని రాష్ట్ర మంతటా కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల్లో ఇదే నమ్మకాన్ని తెలుగుదేశం పార్టీ కొనసాగిస్తుందని ఆయన చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే సంపదను సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలిగిన ఏకైక నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారు అంటే అది చంద్రన్న అని ప్రజలందరూ తెలుసుకున్నారని ఆయన తెలిపారు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలిగిన ఏకైక నాయకుడు చంద్రన్న అని ప్రజలు నమ్మకం పెట్టుకున్నారని ఆయన తెలిపారు అందుకే అమరావతి రాజధానిలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని ఆయన తెలిపారు

# నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు : సిఐ శ్రీనివాస్



**గుడివాడ,జనవరి 16 (వార్తాప్రభ) :**గుడివాడ వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని 1టౌన్ సిఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ వేలకు వేలు ఖర్చుపెట్టి ప్రభుత్వాలు, ప్రజలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ముఖ్యమైన కూడళ్ళలో, రోడ్లమీద, ఇళ్లల్లో, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు పెడుతుంటే చట్టం అంటే గౌరవం లేని వ్యక్తులు నేరం చేసి తప్పించుకు తిరుగుతున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు తమ వాహనాలకు ముందు వెనుక నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్నారన్నారు. దానివలన తప్పు చేసిన వారిని పట్టుకోవడం కష్టతరమవుతుందని, ఎంత పెద్ద నేరమైన ఏదో ఒక వాహనంతో అనుసంధానం (లింకప్) అయి ఉంటుందన్నారు. ప్రతి నేరంలో నేరస్తులను పట్టుకోవడంలో వాహనాల నెంబర్లు అనేవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. రిజిష్టర్ చేసిన వాహనాలకు ఆర్.ఓ అఫీస్ నుండి నెంబర్ ఇస్తారు కాబట్టి అలాంటిది రిజిస్ట్రేషన్ నెంబర్ వచ్చిన తర్వాత కూడా నెంబర్ ప్లేట్ లేకుండా కొంత మంది తిరుగుతున్నారన్నారు. కొంతమంది ప్రజలు మోటారు వాహనాలు చట్టం చలానాలు నుండి, పోలీసులు తీసే ఫోటోలు నుండి తప్పించుకునేందుకు నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపడం జరుగుతుందన్నారు. దీనిని అవకాశంగా మార్చుకుని పెద్ద పెద్ద నేరాలు చేసే నేరస్తులు పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారన్నారు. ప్రజలందరూ తమ తమ వాహనాలకు తప్పని సరిగా ప్రభుత్వం జారీ చేసిన నెంబర్ పెట్టుకుని పోలీస్‌కి సహకరించాలని సిఐ శ్రీనివాస్ కోరారు.

# 'తెలుగు కీర్తి' పురస్కారానికి సోమన్న ఎంపిక



**కర్నూలు,జనవరి 16 (వార్తాప్రభ) :** పెద్దకడబూరు మండల పరిధిలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త ,బాలబంధు గద్వాల సోమన్నను "తెలుగు కీర్తి "పురస్కారం వరించింది. జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న వీరి ఖాతాలో మరో పురస్కారం జమ కావడం విశేషం.రమారమి 6 వసంతాల కాల వ్యవధిలో 63 పుస్తకాలు రచించి,పలు చోట్ల వాటిని ఆవిష్కరించిన గద్వాల సోమన్న అవిరళ కృషిని గుర్తించి తెలుగు భాష,సంస్కృతి,వైభవం,సాహిత్యం,కళల పరిరక్షణ కోసం 143 ఈవెంట్స్ తో ప్రత్యేక రీతిలో నిరంతరాయంగా శ్రమిస్తున్న ,ప్రభంజనం సృష్టిస్తున్న శ్రీశ్రీ కళావేదిక గౌరవ సి.ఇ. ఓ డా.కత్తిమండ ప్రతాప్ తెలుపు కీర్తి పురస్కారానికి సోమన్నను ఎంపిక చేశారు.తెలుగు అసోసియేషన్ ఆఫ్ తెలుగు అకాడమీ బుక్స్ ఆఫ్ రికార్డ్స్,వరల్డ్ ఫోరమ్ రైటర్స్,వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్తంగా జనవరి 21 మంగళవారం-2025న నిర్వహించే కార్యక్రమంలో శ్రీ కౌత పూర్ణానంద్ విలాస్ శ్రీశ్రీ కళావేదిక-విజయవాడలో ఈ అవార్డు అతిరతిమహారథులు,కవులు,కళాకారులు, ఉపాధ్యాయుల సమక్షంలో కవి సోమన్న ఈ పురస్కారం అందుకోనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.'తెలుగు కీర్తి' పురస్కారముకు ఎన్నికైన గద్వాల సోమన్న ను తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

# మండలి ఇంట ఘనంగా గోదారంగనాధుల కళ్యాణం

● గోదా అమ్మవారికి మంగళసూత్రాలు బహుకరించిన మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని దంపతులు..






**గుడివాడ,జనవరి 16 (వార్తాప్రభ) :** స్థానిక పెద ఎరుకపాడులో వైఎస్ఆర్సిపి జిల్లా నాయకులు, ప్రముఖ ఆడిటర్, ఆధ్యాత్మిక చింతనాపరులు మండలి హనుమంతరావు -పద్మావతి దంపతులు ఇంట ధనుర్మాసం సందర్భంగా గత 30రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవ్రతం ముగింపు సందర్భంగా అందులో అంతర్లీనంగా శ్రీగోదాదేవి, రంగనాధుల కళ్యాణాన్ని భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవికి సంప్రదాయబద్ధంగా పండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరు గోవిందరాజులు, సత్యవాణిల కుమార్తె, మండలి హనుమంతరావు దంపతుల మనుమరాలు చి॥ యోఫి, మండలి దంపతుల మేనకోడలు అడపా జగదీశ్వరి (అమ్ములు)లను గోదాదేవిగా అలంకరించారు. వివిధ రకాల ఫలాదులతో అమ్మవారి మూర్తి విగ్రహాన్ని రూపొందించి భక్తులను పారవశ్యంలో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో పెద ఎరుకపాడు గ్రామస్థులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొని మండలి దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా గోదాదేవి అమ్మవారికి మాజీ శాసనసభ్యులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), అనుపమ దంపతులు గోదాదేవి అమ్మవారికి బంగారు సూత్రాలు బహుకరించారు.

# బి జె కె హై స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పెడన,జనవరి 16 (వార్తాప్రభ) :** బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇచ్చిన అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. 1995 -96 బ్యాచ్ (స్వర్ణోత్సవ బ్యాచ్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థినులు వారి గురువులను ఘనంగా సత్కరించారు ఆటపాటలతో చిన్ననాటి జ్ఞాపకాలను తలుచుకుని ఎంతో ఆనందాన్ని పొందారు పదవ తరగతి పూర్తయి 30 సంవత్సరాలు అయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో విదేశాలలో ఉన్నత ఉద్యోగాలలో ఉన్నటువంటి ఆనాటి విద్యార్థులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ గురువులను సత్కరించుకొన్నారు .తమ అదృష్టంగా భావించారు ఈ కార్యక్రమాన్ని ఎంతో చక్కగా నిర్వహించిన విద్యార్థినీ విద్యార్థులను చూసి గురువులందరూ ఎంతో సంతోషించారు.



# మాజీ మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జీ చిన్నారెడ్డి



**హైదరాబాద్,జనవరి 16 (వార్తాప్రభ) :** కేంద్ర మాజీ మంత్రి ఎస్ జైపాల్ రెడ్డి 83వ జయంతిని పురస్కరించుకొని గురువారం హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్ స్ఫూర్తి స్థల్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ఎస్. జైపాల్ రెడ్డి చేసిన కృషిని ఈ సంధర్భంగా చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఉత్తమ పార్లమెటీరియన్ గా, ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే మేధావీ జైపాల్ రెడ్డి అని చిన్నారెడ్డి కొనియాడారు. జైపాల్ రెడ్డి సమాధి వద్ద చిన్నారెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఎస్. జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఆయన అభివాదం చేశారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188